'పది' సప్లిమెంటరీ ఫలితాలు విడుదల

నంద్యాల (నూనెపల్లె), జూన్ 26: పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలు బుధవారం విడుదలయ్యాయి. జిల్లాలో 27 పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులు పరీక్షలు రాశారు. బుధవారం వెల్లడించిన ఫలితాలలో నంద్యాల జిల్లా 80.29 శాతం ఉత్తీర్ణత సాధించి రాష్ట్రంలో ఆరో స్థానంలో నిలిచింది. జిల్లా వ్యాప్తంగా 4,826 మంది పరీక్షలకు హాజరు కాగా వీరిలో 3,098 మంది బాలురు, 1,728 మంది బాలికలు ఉన్నారు. మొత్తం 3,875 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు డీఈఓ సుధాకర్ రెడ్డి తెలిపారు.



పచ్చర్ల వద్ద రహదారిపై ఆందోళన చేస్తున్న గ్రామస్థులు



పులి నుంచి కాపాడండి

- ప్రధాన రహదారిపై పచ్చర్ల గ్రామస్థుల ఆందోళన
- పులి కోసం బోన్లు, ట్రాప్ కెమెరాలు ఏర్పాటు చేసిన అధికారులు
- భక్తులు ఒంటరిగా అడవిలోకి వెళ్లరాదు

శిరివెళ్ల, జూన్ 26 :

నంద్యాల-గిద్దలూరు రహదారిలో ఇండ్ల మధ్య తిరుగుతున్న చిరుత పులి నుంచి రక్షణ కల్పించాలంటూ పచ్చర్ల గ్రామస్థులు బుధవారం ఆందోళన చేపట్టారు. అటవీ ఉత్పత్తులపై ఆధారపడి జీవిస్తున్న తాము చిరుత పులి సంచారంతో బయటికి వెళ్లలేకపోతున్నామని, కుటుంబ పోషణ భారంగా మారిందని ప్రధాన రహదారిపై చేరి ఆందోళన చేశారు. మంగళవారం కట్టెల కోసం అడవిలోకి వెళ్లిన మాజీ ఉప సర్పంచ్ షేక్ మెహరున్నీసా(40)పై చిరుత పులి దాడి చేసి హతమార్చడంతో గ్రామస్థులు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. ఇంట్లో నిద్రిస్తున్న ఓ మహిళపై ఇటీవల చిరుత పులి దాడి చేయబోయిందని అన్నారు. చిరుత పులి నుంచి రక్షణ కల్పించాలని, షేక్ మెహరున్నిసా కుటుంబానికి న్యాయం చేయాలని స్థానికులు ఆందోళనకు దిగారు. దీంతో రహదారిపై వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పచ్చర్ల ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ఈశ్వరయ్య అటవీ సిబ్బందితో అక్కడికి చేరుకుని గ్రామస్థులతో చర్చించారు.

చిరుత పులి కోసం బోన్లు

చిరుత పులిని పట్టుకునేందుకు అటవీశాఖ అధికారులు పలు చోట్ల బోన్లు ఏర్పాటు చేసారు. పులి జాడ కనుగొనేందుకు ట్రాప్ కెమెరాలను అమర్చారు. అటవీ ప్రాంతంలోని ఓ మడుగు వద్ద పులి పాద ముద్రలను అధికారులు గుర్తించారు. దీంతో చిరుత పులి సంచరిస్తున్న ప్రాంతాలు, తిరిగే సమయం ఆధారంగా మరిన్ని బోన్లను ఏర్పాటు చేస్తున్నట్లు ఎఫ్ఆర్వో ఈశ్వరయ్య తెలిపారు.



చిరుత పులి కోసం ఏర్పాటు చేసిన ట్రాప్ కెమెరా

మహానంది గోశాల పరిసరాల్లో చిరుత పులి

ఆందోళన చెందుతున్న భక్తులు, స్థానికులు

మహానంది, జూన్ 26: మహానంది ఆలయ పరిసరాల్లోని గోశాల వద్ద బుధవారం తెల్లవారుజామున 2 గంటల ప్రాంతంలో పెద్ద పులి సంచరించినట్లు అక్కడి సీసీ ఫుటేజీల్లో కనిపించింది. దీంతో అక్కడికి కాపలా వెళ్ళడానికి సిబ్బంది సిద్ధం కాలేకపోతున్నారు. ఇప్పటికే ప్రతి రోజూ అధికారులు పలుమార్లు దేవస్థానం మైకు ద్వారా మహానంది క్షేత్ర పరిసరాల్లో చిరుత పులి సంచరిస్తున్నదని, అప్రమత్తంగా ఉండాలని భక్తులను హెచ్చరిస్తున్నారు. క్షేత్రానికి అత్యంత సమీపంలో ఉన్న గ్రామాల ప్రజలు అడవిలోకి ఒంటరిగా వెళ్ళరాదని ప్రచారం చేస్తున్నారు. దీనిపై బుధవారం నంద్యాల అటవీశాఖ రేంజ్ ఆఫీసర్ దినేష్‌కుమార్‌రెడ్డి, డీఆర్వో హైమవతి, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ ప్రతాప్‌తో పాటు ఆలయ ఏఈఓ వెంకటేశ్వర్లు, గోశాల అర్చకులు బెక్కెం శరభయ్యశర్మ, ధర్మతేజ గోశాల పరిసరాల్లో చిరుతపులి సంచరించిన ప్రాంతంలో పాదముద్రలు సేకరించారు.



చిరుతపులి పాదముద్రలు



మహానంది గోశాల పరిసరాల్లో సీసీ కెమెరాల్లో కనబడిన చిరుతపులి సంచారం



మహానంది గోశాల పరిసరాల్లో చిరుతపులి పాదముద్రలను సేకరిస్తున్న అటవీ సిబ్బంది

అప్రమత్తంగా ఉండండి

- కలెక్టర్ శ్రీనివాసులు
- మూడు రోజుల పాటు దండోరా వేయించండి



చిరుతపులి సంచారంపై అటవీశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించిన కలెక్టర్

నంద్యాల (కల్చరల్), జూన్ 26: మహానంది అటవీ పరిసర ప్రాంతాలలో చిరుతపులి సంచరిస్తున్నందు వల్ల ప్రజలు అప్రమత్తంగా వుండాలని కలెక్టర్ డా.కె. శ్రీనివాసులు తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లోని సెంటినరీ హాల్లో చిరుత పులి సంచారం-జాగ్రత్తలపై జాయింట్ కలెక్టర్‌తో కలిసి అటవీ శాఖ డిప్యూటీ డైరెక్టర్ అనురాగ్ మీనా, నంద్యాల డీఎఫ్‌వో శివశంకర్‌రెడ్డిలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ డా.కె. శ్రీనివాసులు మాట్లాడుతూ నంద్యాల జిల్లా సరిహద్దుల్లోని నల్లమల అటవీ పరిసరాల్లో ఉన్న మహానంది, సిరివెళ్ల, రుద్రవరం మండలాలోని అన్ని గ్రామాలలో మూడు రోజుల పాటు దండోరా వేయించి చిరుతపులి విషయంలో ప్రజలఉ అప్రమత్తం చేయాలని తహసీల్దార్లను ఆదేశించారు. పచ్చర్ల సమీపంలో చిరుతపులిని పట్టుకునేందుకు సీసీ కెమెరాలు, బోన్ ఏర్పాటు చేశామని అటవీశాఖ అధికారులు కలెక్టర్‌కు వివరించారు.

నాణ్యమైన విత్తనాలు పంపిణీ చేయండి

నంద్యాల (కల్చరల్), జూన్ 26: ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు పంపిణీచేసేందుకు ప్రత్యేక కృషి చేయాలని కలెక్టర్ డా.కె. శ్రీనివాసలు వ్యవసాయ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్లోని సెంటినరీ హాల్లో ఖరీఫ్ సీజన్ విత్తనాలకు సంబంధించి జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డితో కలిసి వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ రంగాల అధికారులతో కలెక్టర్ సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. వ్యవసాయ శాఖ, ఉద్యానశాఖ, మైక్రో ఇరిగేషన్, మత్స్యశాఖ, పశుసంవర్ధక శాఖ, ఇరిగేషన్ తదితర శాఖలు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సమగ్ర నివేదికలను వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ డా.కె. శ్రీనివాసులు మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ముందే అడపాదడపా వర్షాలు కురిసి జిల్లాలో సాధారణ వర్షపాతం కంటే 76.7శాతం అధిక వర్షపాతం నమోదైన నేపథ్యంలో ఖరీఫ్ ప్రణాళిక సిద్ధం చేసుకొని రైతులకు అవసరమైన విత్తనాలు రాయితీపై సరఫరా చేసేందుకు సిద్ధంగా వుండాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. జూలై, ఆగస్టు మాసాల్లో సాగు చేసే రైతులకు నాణ్యమైన విత్తనాలు, రసాయనిక ఎరువులు, క్రిమి సంహారక మందుల కొరత ఏర్పడకుండా ప్రణాళిక వేసుకోవాలన్నారు. విత్తనాల సరఫరాకు సంబంధించి సీడ్ కార్పొరేషన్‌లో ఉన్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అన్నారు. ఉద్యానశాఖ, డ్రిప్ ఇరిగేషన్లకు సంబంధించి మండలాల వారీగా పంటల విస్తీర్ణం తదితర వివరాల నివేదికలను వారం రోజుల్లో ఇవ్వాలని అన్నారు. జిల్లాలో వున్న 27వేల మంది కౌలు రైతులకు కూడా పంట రుణాలు అందించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. నంద్యాల, ఆళ్లగడ్డ, గోస్పాడు మండలాలలో నకిలీ విత్తనాలు విక్రయం ఎక్కువగా జరుగుతున్నదని, సంబంధిత డీలర్లకు షోకాజ్ నోటీసులు ఇచ్చి లైసెన్సులు రద్దు చేసేందుకు చర్యలు తీసుకోవాలని మండల వ్యవసాయ అధికారులను జేసీ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిఆర్వో పద్మజ పాల్గొన్నారు.

మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన బీసీ



పదవీ బాధ్యతలు స్వీకరించిన అనంతరం కుటుంబ సభ్యులతో మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

బనగానపల్లె, జూన్ 26: రాష్ట్ర రోడ్లుభవనాల శాఖ మంత్రిగా బీసీ జనార్దన్‌రెడ్డి బుధవారం అమరావతిలోని సచివాలయంలో పదవీ బాధ్యతలు స్వీకరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అందించిన సహకారం, ఆశీర్వాదంతో తాను పదవీ బాధ్యతలు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. మంత్రిగా బాధ్యతలు స్వీకరించే సమయంలో ఆయన సతీమణి బీసీ ఇందిరమ్మ, సోదరులు బీసీ రాజారెడ్డి, బీసీ రామనాథరెడ్డి కుటుంబ సభ్యులు పక్కనే ఉన్నారు. ముందుగా అర్‌అండ్‌బీ అధికారులు బీసీకి పుష్పగుచ్ఛాలు అందజేసి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ వైసీపీ పాలనలో రహదారులు అధ్వానంగా మారాయన్నారు. తెలుగుదేశం పార్టీ హాయంలో 2014-2019లో రోడ్లు భవనాల శాఖకు రూ.14 వేల కోట్లను బడ్జెట్‌లో కేటాయించగా, అప్పట్లో 80 శాతం మేర నిధులు రహదారుల అభివృద్ధి కోసమే కేటాయించామన్నారు. 2019-24 సంవత్సరాల్లో వైసీపీ ప్రభుత్వం హాయంలో రూ.19,428 కోట్లు బడ్జెట్ రోడ్లు, భవనాల శాఖకు కేటాయించగా కేవలం ఖర్చు పెట్టింది రూ. 9వేల కోట్లు మాత్రమే అన్నారు. పెట్టుబడులు పెట్టాలనుకున్న పారిశ్రామిక వేత్తలు ఈ రోడ్లను చూసి, వైసీపీ నేతల కమీషన్లను తట్టుకోలేక ఇతర రాష్ట్రాలకు పారిపోతున్నారన్నారు. కాంట్రాక్టర్లను ఒప్పించి పనులు చేయించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. కాంట్రాక్టర్లకు భరోసా కల్పించి రోడ్ల నిర్మాణాలను పూర్తి చేస్తామని మంత్రి వెల్లడించారు.

మాదకద్రవ్యాల బారిన పడొద్దు

నియంత్రణ దినం ర్యాలీలో కలెక్టర్, ఎస్పీ



ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

నంద్యాల క్రైం, జూన్ 26 : ప్రజలు మాదకద్రవ్యాల బారిన పడొద్దని కలెక్టర్ కె. శ్రీనివాసులు, ఎస్పీ కె. రఘువీర్‌రెడ్డి కోరారు. మాదకద్రవ్యాల నిరోధక దినం సందర్భంగా బుధవారం నంద్యాల పట్టణంలో కలెక్టర్ కె. శ్రీనివాసులు, ఎస్పీ కె. రఘువీర్‌రెడ్డి ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ భారీగా నిర్వహించారు. ర్యాలీ మున్సిపల్ ఆఫీసు నుంచి ప్రారంభమై శ్రీనివాససెంటర్ వరకు కొనసాగింది. ర్యాలీలో పట్టణంలోని వివిధ కళాశాలల విద్యార్థులు, గ్రామ, వార్డు సచివాలయాల కార్యదర్శులు, ఎన్జీవోలు, మానసిక వైద్యనిపుణులు, రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు, పోలీసు సిబ్బంది, స్పెషల్ ఎన్‌రోల్‌మెంట్ బ్యూరో అధికారులు పాల్గొన్నారు. డ్రగ్స్ వద్దు-ఆరోగ్యమే ముద్దు అంటూ నినాదాలు చేశారు. శ్రీనివాససెంటర్‌లో మానవహారంగా ఏర్పడి డ్రగ్స్ వల్ల కలిగే దుష్ప్రభావాలపై అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉత్తర్వుల మేరకు నంద్యాల జిల్లా అంతటా మాదకద్రవ్యాల వ్యతిరేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో మాదకద్రవ్యాల నియంత్రణకు అన్ని రకాల చర్యలు తీసుకుంటామని ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ కె.ప్రవీణ్‌కుమార్, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసులు, అగ్నిమాపకశాఖ అధికారులు, సెబ్ అధికారులు, మానసిక వైద్య నిపుణులు, రెడ్‌క్రాస్ సొసైటీ సిబ్బంది, ఇన్‌స్పెక్టర్లు ఇస్మాయిల్, రాజారెడ్డి, నరసింహులు, చలపతి, దస్తగిరిబాబు, ఆర్ఐలు మంజునాథ్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

కుందూ నిండా గుర్రపు డెక్క

- తొలగించకుంటే నదీ ప్రవాహానికి ఆటంకం
- రైతులకు తీవ్ర కష్టాలు

నంద్యాల టౌన్, జూన్ 26 :

కుందూనదిని గుర్రపు డెక్క పిచ్చి మొక్క కమ్మేసింది. గతంలో ఎన్నడూ లేని విధంగా గుర్రపు డెక్క పెరిగిపోవడంతో వర్షాకాలంలో నీటి ప్రవాహం ఆగిపోయే ప్రమాదం ఏర్పడింది. పరివాహక ప్రాంతాల్లో సాగునీటిపై ఆధారపడ్డ పంట పొలాలకు తీవ్ర ఇబ్బందులు తప్పవు. ఈ ఏడాది మార్చి నుంచి కుందూనదిలో గుర్రపు డెక్కమొదలై గతంకంటే తీవ్రమైంది. దీని వల్ల కుందూలో నీటి ప్రవాహం కనిపించకుండాపోయింది. నంద్యాల జిల్లాలో ఓర్వకల్లు, గడివేముల, బండి ఆత్మకూరు, నంద్యాల, పాణ్యం, గోస్పాడు, కోవెలకుంట్ల, దొర్నిపాడు, ఉయ్యాలవాడ, చాగలమర్రి, తదితర మండలాల్లో కుందూ నది ప్రవహించి కడప జిల్లాలో పెన్నా నదిలో కలుస్తుంది. అయితే ఈసారి కుందూనదిలోని పలు ప్రాంతాల్లో గుర్రపు డెక్క విపరీతంగా పెరగడంతో నీటి పారుదల ప్రశ్నార్థకమైంది.



నీటిని పూర్తిగా కప్పేసిన గుర్రపు డెక్క

మొక్కే కదా అని వదిలేస్తే..

గుర్రపు డెక్క నీటిలో తేలియాడుతూ పెరిగే తీగ మొక్క. నీటిలో ఉన్న విష పదార్థాలను పీల్చుకొని అతి త్వరగా పెరగడం దీని ప్రత్యేకత. విష పదార్థాలతో పాటు అడుగు భాగంలో ఉండే నీటిలోని ఆక్సిజన్‌ను కూడా గుర్రపు డెక్క పీల్చుకుంటుంది. కొద్ది రోజుల్లోనే నీటి మొత్తాన్ని కప్పేసేలా పెరిగిపోతుంది. చెరువులో గుర్రపుడెక్క పడి మొలిస్తే చెరువు మట్టి దిబ్బగా మారుతుందని వ్యవసాయ నిపుణులు పేర్కొంటున్నారు. దీని వల్ల నీటిలో పల పెరుగుదల పూర్తిగా నిలిచిపోతుంది. నీటి కింది భాగంలో ఆక్సిజన్ లేకపోతే చేపలు చనిపోతాయి.

వర్షాకాలంలో కష్టాలు తప్పవు ..

సాధారణంగా చిన్న చిన్న చెరువులు, పిల్ల కాలువల్లో అగుపించే గుర్రపు డెక్కను ఎవరూ పెద్దగా పట్టించుకోరు. నీరు ఎక్కువగా ఉన్న చోట అతివేగంగా పెరిగే మొక్కల్లో గుర్రపు డెక్క ప్రధానమైంది. నీటిపై తేలుతూ మొత్తం నీరు నిల్వ ఉన్న ప్రాంతాన్ని, చుట్టుపక్కల ఉన్న భూములను తక్కువ వ్యవధిలోనే వందల మీటర్లు అల్లుకపోతుంది. మొక్క ఆకు వెడల్పుగా, మొక్క అడుగు భాగం ఉబ్బెత్తుగా ఉండటంతో ఎక్కువ స్థలాన్ని ఆక్రమిస్తుంది. మొక్క కింది భాగంలో స్పాంజి మాదిరిగా ఉబ్బెత్తుగా ఉన్న కాయలు కింద నీటిని పీల్చి బరువెక్కుతాయి. అందులోనే నీరు నిలిచిపోవడంతో కాలువల్లో నీరు ముందుకు కదలదు.



నంద్యాల సమీపంలో కుందూను కమ్మేసిన గుర్రపు డెక్క

తొంగి చూడని నీటి పారుదల శాఖ అధికారులు

గుర్రపు డెక్కతో గత మూడు నెలలుగా కుందూ ప్రవాహం మొత్తం నిలిచిపోయింది. రైతుల పొలాలకు నీరు పారడం ప్రశ్నార్థకంగా మారింది. అయినా నీటి పారుదల శాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. సాధారణంగా వేసవిలో గుర్రపు డెక్క ఎక్కువగా అగుపిస్తుంది. అయితే ఈ ఏడాదిగా గతంలో ఎన్నడూ కుందూలో గుర్రపు డెక్క చూడలేదని పరివాహక ప్రాంత ప్రజలు పేర్కొంటున్నారు. వర్షాలు మొదలయ్యాయి కాబట్టి అధికారులు వెంటనే ఈ సమస్యను పరిష్కరించాలని రైతులు, పరివాహక ప్రాంత ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

శ్రీ భ్రమరాంబా మల్లికార్జున స్వామివార్ల దేవస్థానం,
శ్రీశైలం - 518101, నంద్యాల జిల్లా, ఆంధ్రప్రదేశ్.

పేపరు ప్రకటన

ఆర్.సి.నెం.ఇ4/909/2024, తేదీ:25.06.2024

శ్రీశైల దేవస్థానము లడ్డు విక్రయ కేంద్రములో **లడ్డు, పులిహోర** మరియు వడ ప్రసాదములను భక్తులకు ఇచ్చుటకు గాను అవసరమైన సిబ్బందిని రెండు (2) సంవత్సరముల కాలపరిమితికి సమకూర్చుటకు గాను తేదీ : **15.06.2024**న ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన ఇవ్వడం జరిగినది. కాని కొన్ని అనివార్య కారణముల చేత సదరు టెండరును తాత్కాలికముగా నిలుపుదల చేయడమైనది. టెండరుదారులు గమనించగలరు.

శ్రీ స్వామి అమ్మవార్ల సేవలో.. సం/- **డి.పెద్దిరాజు,** కార్యనిర్వహణాధికారి.

మెప్మాపై అవినీతి మరకలు

సిబ్బంది చేతివాటంపై వెల్లువెత్తుతున్న ఆరోపణలు

ఇటీవల సమీక్షలో ఆగ్రహించిన ఎమ్మెల్యే బీవీ



ఎమ్మిగనూరు, జూన్ 26: పురపాలక సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా)పై అవినీతి మరకలు అంటుకున్నాయి. ఇటీవల ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి మెప్మా విభాగంపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే లేవనెత్తిన పలు ప్రశ్నలకు మెప్మా సిబ్బంది, అధికారులు సమాధానం చెప్పలేక నీళ్లు నమిలారు. మెప్మా విభాగంలో 1900 పొదుపు గ్రూపులు ఉండగా దాదాపు 20వేల మంది సభ్యులు ఉన్నారు. 2023-24కు సంబంధించి బ్యాంకుల ద్వారా ఆయా గ్రూపులకు దాదాపు రూ.12.98 కోట్ల రుణాలు ఇప్పించారు. అంతేగాక పీఎం సమృద్ధి యోజన కింద పట్టణంలోని వివిధ చిరు వ్యాపారులకు రూ.10వేల చొప్పున 1900 మందికి కేంద్ర ప్రభుత్వం ద్వారా రుణాలు మంజూరు చేయించారు. అలాగే సున్నా వడ్డీ రుణాల 1840 గ్రూపులకు రూ.3 కోట్లు వచ్చాయి. అలాగే ఆసరా పథకం కింద 1660 గ్రూపులకు రూ.39.72 కోట్లు వచ్చాయి. మెప్మా విభాగంలో ఇంత భారీ మొత్తంలో కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. పొదుపు గ్రూపులను ఏర్పాటు చేయడం, గ్రూపు సభ్యులకు బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించడం, కొత్తకొత్త వ్యాపారాలను ఏర్పాటు చేసేందుకు అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం దాదాపు 60 మంది ఆర్‌పీలు, ఐదు మంది సీవోలను నియమించింది. అయితే వీరు కొత్త గ్రూపుల ఏర్పాటు చేసే విషయంలోను, ఉన్న గ్రూపులకు బ్యాంకుల ద్వారా రుణాలు మంజూరు చేయించే విషయంలోనూ తమదైన శైలిలో చేతివాటం ప్రదర్శించారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. రుణాలు ఇప్పించే సమయంలో బ్యాంకు అధికారులు, మెప్మా అధికారుల పేర్లు చెప్పి పొదుపు గ్రూపుల నుంచి కొంత మొత్తాన్ని దండుకుంటున్నట్టు సమాచారం. అంతేగాక పీఎం సమృద్ధి యోజన పథకం దరఖాస్తు చేసే విషయంలో తమకు ఇష్టం ఉన్న వారితో దరఖాస్తు చేయించి వారికి మాత్రమే రుణాలు అందేలా వ్యవహరించారన్న విమర్శలు ఉన్నాయి. ఆర్‌పీల్లో కొంతమంది గ్రూపు సభ్యుల అవతారం ఎత్తడంతో పాటు బినామీ సభ్యులను ఏర్పాటు చేసుకొని బ్యాంకుల నుంచి రుణాలు తీసుకున్నారన్న ఆరోపణలు కూడా గతంలో వచ్చాయి. అంతేగాక తాము చెప్పిన మాట వినడం లేదని, కొంతమంది గ్రూపుల నుంచి లీడర్లపై ఒత్తిడి తీసుకురావడం, తొలగిస్తామని బెదిరించడం వంటివి సైతం జరిగినట్లు తెలుస్తోంది.

ఎమ్మెల్యే ఆగ్రహంతో వెలుగులోకి..

కొంతమంది కొన్నేళ్లుగా ఆర్‌పీలుగా కొనసాగుతుండడంతో గుత్తాధిపత్యం వహిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. అలాగే జగనన్న మార్ట్ ఏర్పాటు కోసం గతేడాది గ్రూపుల నుంచి దాదాపు రూ.19లక్షలు వసూలు చేసినప్పటికీ మార్ట్ ఏర్పాటుకు నోచుకోలేదు. ఈ విషయం



పాత మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ఉన్న మెప్మా కార్యాలయం

కాస్తా ఇటీవల ఎమ్మెల్యే సమీక్షలో బయటపడింది. దీంతో ఎమ్మెల్యే ఎవరి దగ్గరి నుంచి అయితే డబ్బు వసూలు చేశారో వారికి తిరిగి చెల్లించాలని ఆదేశించారు. అయితే ఇప్పటికీ కొన్ని గ్రూపులకు సొమ్ము అందలేదంటే ఎమ్మెల్యే ఆదేశాలను ఎలా బేఖాతరు చేస్తున్నారో అర్థం చేసుకోవచ్చు. అలాగే నిరాశ్రయుల కేంద్రం నిర్వహణపై కూడా అధికారులు, మెప్మా సిబ్బంది సరైన సమాధానం చెప్పకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. మెప్మాలో విధులు నిర్వహిస్తున్న పీవోతోపాటు సీవోలు గ్రూపుల నిర్వహణపై పర్యవేక్షణ లేకపోవడం, ఆర్‌పీల విధుల నిర్వహణపై పర్యవేక్షణ లేకపోవడం వల్లే ఎవరు ఏమిచేస్తున్నారో తెలియని పరిస్థితి ఏర్పడిందని పట్టణ వాసులు చర్చించుకుంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు మెప్మా విభాగంపై ప్రత్యేక శ్రద్ధ చూపి ఎప్పటికప్పుడు తనిఖీలు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని పట్టణవాసులు కోరుతున్నారు. మెప్మాలో జరుగుతున్న అక్రమాలపై స్థానిక పీవో జయవర్ధన్‌ను వివరణ కోరగా సభ్యులు ఫిర్యాదు చేస్తే విచారించి తొలగిస్తామన్నారు. జగనన్న మార్ట్‌కు వసూలు చేసిన మొత్తాన్ని ఇప్పటికే చాలా వరకు తిరిగి ఇచ్చామని చెప్పారు.. కొంతమందికి పంపిణీ సోమవారంలోపు పూర్తిచేస్తామని తెలిపారు.

యంత్ర సేవపై విచారణ

- అక్రమాలను వెలికి తీయాలని ఆదేశించిన మంత్రి అచ్చెన్నాయుడు
- వైసీపీ నేతల్లో వణుకు

కర్నూలు(అగ్రికల్చర్), జూన్ 26: గత వైసీపీ ప్రభుత్వం రైతుల కోసమంటూ దాదాపు రూ.2వేల కోట్లకు పైగా ఖర్చుతో అమలు చేసిన వైఎస్సార్ యంత్ర సేవా పథకంలో పెద్ద ఎత్తున అక్రమాలు జరిగాయని, వెంటనే విచారణ చేయాలని వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశించారు. దీంతో వైసీపీ నాయకులు, ఉన్నతాధికారుల్లో వణుకు మొదలైంది. కర్నూలు జిల్లాలో 466 యంత్రసేవా కేంద్రాల ద్వారా యంత్ర పరికరాలను 1,765 మంది రైతులకు అందించినట్లు వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. దీని కోసం రూ.16.26 కోట్లు ఖర్చు చేశారు. అదే విధంగా నంద్యాల జిల్లాలో రూ.15.74 కోట్లతో 408 యంత్ర సేవా కేంద్రాల ద్వారా 2,065 మంది రైతులకు ట్రాక్టర్లు, హార్వెస్టింగ్ యంత్రాలు, ఇతర వ్యవసాయ పరికరాలను అందజేశారు. ఈ పథకం అమలు కోసం ఒక్కో యూనిట్‌కు రూ.15 నుంచి 25 లక్షలు ఖర్చు చేశారు. ప్రభుత్వం 40 శాతం మొత్తాన్ని రాయితీ రూపంలో ఇచ్చింది. మిగిలిన 60 శాతంలో పది శాతం రైతులు భరించాలని, మిగిలిన 50 శాతం మొత్తాన్ని జిల్లా సహకార కేంద్ర బ్యాంకు రుణంగా ఇవ్వాలని ప్రభుత్వం చెప్పింది. అయితే ఈ పథకం అమలులో పెద్ద ఎత్తున అక్రమాలు జరిగినట్లు రూ.కోట్లల్లో ముడుపులు వైసీపీ నేతలకు అందినట్లు ఆరోపణలు ఉన్నాయి. దీని మీద బుధవారం మంత్రి అచ్చెన్నాయుడు విజయవాడలో వ్యవసాయ శాఖ రాష్ట్ర అధికారులతో సమావేశమై ఈ పథకం అమలులో జరిగిన అవకతవకలు, అక్రమాలపై పూర్తి స్థాయిలో విచారణ చేపట్టాలని ఆదేశించారు.

బాల కార్మికులపై స్పెషల్ డ్రైవ్



బాల కార్మికులపై స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్న అధికారులు

కర్నూలు(లీగల్), జూన్ 26: నగరంలో పెరిగిపోతున్న బాల కార్మికులను తగ్గించడానికి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ బుధవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించింది. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి, జిల్లా లేబర్ కమిషనర్ వెంకటేశ్వర్లు, అసిస్టెంట్ లేబర్ కమిషనర్ సాంబ శివ ఆధ్వర్యంలో వీధి బాలలను గుర్తించడానికి రెండు బృందాలను ఏర్పా టు చేశారు. ఈ రెండు బృందాలు నగరంలోని వివిధ ప్రాంతాలలో తనిఖీలు నిర్వ హించి ముగ్గురు బాలలను గుర్తించాయి. ఆ తర్వాత బాలల తల్లిదండ్రులను పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించి వారికి అప్పగించారు. ఈ కార్యక్రమంలో డీసీ పీవో మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలపట్ల అప్రమత్తంగా ఉండాలి

మాదక ద్రవ్యాలు స్లోపాయిజన్ లాంటివని, వాటికి అలవాటు పడితే.. జీవితాలు నాశనమవుతాయని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి అన్నారు.. మాదక ద్రవ్యాల వ్యతిరేక దినం సందర్భంగా బుధవారం స్థానిక న్యాయ సేవాసదన్ భవన్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రారంభంలో మాదక ద్రవ్యాలను తమాషాగా తీసుకుంటే ఆ తర్వాత అవి లేకుంటే బతకలేమన్నంతగా పరిస్థితి తయారవుతుందని అన్నారు. వీటికి దూరంగా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో చీఫ్ డిఫెన్స్ లీగల్ కౌన్సిల్ ఎస్.మనోహర్, గవర్నమెంటు నర్సింగ్ విద్యార్థినులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల బలోపేతానికి సహకరించాలి

5వ రాష్ట్ర ఆర్థిక సంఘం సభ్యులు



జిల్లా పరిషత్ సమావేశ భవనంలో మాట్లాడుతున్న ఆర్థిక సంఘం సభ్యులు

కర్నూలు(న్యూసిటీ), జూన్ 26: ఉమ్మడి కర్నూలు జిల్లాలో స్థానిక సంస్థల బలోపేతానికి సహకరించాలని 5వ రాష్ట్ర ఆర్థిక సంఘం సభ్యులు కోరారు. ఉమ్మడి జిల్లా పర్యటన పురస్కరించుకుని బుధవారం జిల్లా పరిషత్ సమావేశ భవనంలో జిల్లా పరిషత్ సీఈఓ జి. నాసరరెడ్డి అధ్యక్షతన ఉమ్మడి జిల్లా జిల్లా పంచాయతీ అధికారులు, డీఎల్‌పీఓలు, ఎంపీడీఓలు, ఈఓఆర్‌డీ, డివిజన్‌కు ముగ్గురు చొప్పున ఎంపికైన పంచాయతీ కార్యదర్శులు, ప్రతి మండలం నుంచి ఎంపికైన ఇద్దరు సర్పంచులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి సంఘం సభ్యులు ఎం. ప్రసాదరావు, ఎంవిఎస్. పద్మారావు, కే. కృపారావు పాల్గొన్నారు. రానున్న కాలంలో స్థానిక సంస్థలను అభివృద్ధి చేసేందుకు ఎలాంటి చర్యలు తీసుకోవాలో క్షుణ్ణంగా పరిశీలించి ప్రభుత్వానికి నివేదించేందుకు సభ్యులు జిల్లాకు వచ్చారు. గ్రామ, మండలాలను అభివృద్ధి పథంలో నడిపించడానికి తగిన సూచనలను జిల్లా పంచాయతీ అధికారులు, కార్యదర్శులు, సర్పంచుల నుంచి సభ్యులు తీసుకున్నారు. ఈ సందర్భంగా సంఘం సెక్రటరీ డా.కేవీ. రమణారెడ్డి మాట్లాడుతూ గ్రామ పంచాయతీ, మండల స్థాయిలో ఆదాయ వనరులు ఏ విధంగా పెంచుకోవాలి, అనవసర ఖర్చులు ఎలా తగ్గించుకోవాలో నిర్దిష్టమైన నివేదికలు ఇవ్వాలని ఆదేశించారు. మధ్యాహ్నం నగర పాలక సంస్థకు సంబంధించి ఎస్‌బీఐ కాలనీలోని న్యూ కౌన్సిల్ హాలులో కమిషనర్ ఏ. భార్గవతేజ అధ్యక్షతన రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఇంటి పన్నుల వసూలు ఏ స్థాయిలో చేస్తున్నారని...వంద శాతం పూర్తి చేసేందుకు ఎలాంటి చర్యలు తీసుకోవాలో నివేదికలు ఇవ్వాలని సభ్యులు కమిషనర్‌ను కోరారు. ఈ సమావేశంలో కర్నూలు, నంద్యాల జిల్లా పంచాయతీ అధికారులు టీవీ నాగరాజనాయుడు, మంజుల, డీఎల్‌పీఓ నూర్జహాన్, ఈఓఆర్‌డీలు పాల్గొన్నారు.

మిగిలిన సీట్లకు దరఖాస్తులు

కర్నూలు(ఎడ్యుకేషన్), జూన్ 26: ఉమ్మడి జిల్లాలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులాల్లో 6, 7, 8, 9 తరగతుల్లో మిగిలి ఉన్న సీట్లను భర్తీ చేసేందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరినట్లు జిల్లా కోఆర్డినేటర్ ఐ.శ్రీదేవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తులను ప్రవేశం కోరిన పాఠశాలలో పొందాలన్నారు. పూరించిన దరఖాస్తుతో పాటు ఆధార్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం, రెండు పాస్‌ఫొటోలు జతపరిచి ఈ నెల 28వ తేదీలోగా వారు ప్రవేశం కోరిన పాఠశాలలో సమర్పించాలన్నారు. రాత పరీక్ష ద్వారా ఎంపిక జరుగుతుందన్నారు. దరఖాస్తులను ఈ నెల 26వ తేదీ నుంచి 28వ తేదీలలో దరఖాస్తులు ప్రవేశం కోరిన పాఠశాలలో సమర్పించాలన్నారు. ఈ నెల 29న ఉదయం 10 గంటలకు దరఖాస్తు చేసుకున్న పాఠశాలల్లో ప్రవేశ పరీక్ష జరుగుతుందని తెలిపారు. ప్రశ్నపత్రం గత తరగతికి చెందిన సిలబస్ ప్రకారం అబ్జెక్టివ్ విధానంలో 50 మార్కులకు పరీక్ష ఉంటుందన్నారు. ప్రవేశ పరీక్షలో వచ్చిన మెరిట్ ఆధారంగా సీట్ల కేటాయింపు ఉంటుందన్నారు. వివరాలకోసం సమీపంలోని గురుకులాల్లో సంప్రదించాలని సూచించారు.

కోసిగి కేజీబీవీని తనిఖీ చేసిన డీఈఓ

కోసిగి మండలంలోని కేజీబీవీని బుధవారం జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్ తనిఖీ చేశారు. మెనూ సక్రమంగా పాటించలేదని అసంతృప్తిని వ్యక్తం చేశారు. అందుకు కారణమైన కేజీబీవీ పాఠశాల స్పెషల్ ఆఫీసర్, అకౌంటెంట్‌కు నోటీసులు జారీ చేసినట్లు డీఈఓ తెలిపారు. మెనూ ప్రకారం భోజనం, రుచిగా, శుచిగా, శుభ్రంగా వడ్డించాలని నిర్వాహకులకు ఆయన సూచించారు.

మోదీని సత్కరించిన ఎంపీ బస్తిపాటి నాగరాజు



ప్రధాని మోదీని కలిసి ఎంపీ

కర్నూలు(అర్బన్), జూన్ 26: ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పార్లమెంట్ సమావేశాల్లో భాగంగా ఢిల్లీలో ఉన్న ఎంపీ నాగరాజు సహచర ఎంపీలతో పాటు కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడుతో కలిసి ప్రధాని మోదీని కలిశారు. ఈ సందర్భంగా కురువ సంప్రదాయ వస్త్రంతో తయారు చేసిన కండువాతో మోదీని సత్కరించారు.

రాష్ట్రపతి, ప్రధానిని కలిసిన బైరెడ్డి శబరి



రాష్ట్రపతిని కలిసిన నంద్యాల ఎంపి బైరెడ్డి శబరి

కల్లూరు, జూన్ 26: నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి కుటుంబ సభ్యులతో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధానమంత్రి నరేంద్రమోదీని బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. వారిని కలిసి శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామి ప్రసా దాలను అందజేశారు. ఆమె వెంట మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, బైరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి, కుటుంబ సభ్యులు ఉన్నారు.

బిడ్డను చంపుకున్న తల్లి

- ఆ తర్వాత గూడ్స్ రైలు కింద పడాలని యత్నం
- అడ్డుకున్న కుటుంబ సభ్యులు, స్థానికులు
- మతిస్థిమితం సరిగా లేకపోవడంతోనే...
- దేవరబెట్టలో విషాదం



విశ్వనాథ్ (ఫైల్)

కోసిగి, జూన్ 26: కోసిగి మండలంలోని దేవరబెట్ట గ్రామంలో హృదయ విదారక ఘటన జరిగింది. మతిస్థిమితం లేని ఓ తల్లి పది నెలల కొడుకు గొంతు నులిమి చంపి గూడ్స్ రైలు కింద పడి ఆత్మహత్య చేసుకోడానికి ప్రయత్నించింది. ఈ ఘటన బుధవారం తుంగభద్ర పాత రైల్వేస్టేషన్ సమీపంలో చోటు చేసుకుంది. మండలంలోని దేవరబెట్ట గ్రామానికి చెందిన కొండ రామాంజనేయులుకు, తుమ్మిగనూరు గ్రామానికి చెందిన హనుమంతమ్మకు ఐదేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు. గత కొన్ని నెలలుగా హనుమంతమ్మ మానసిక స్థితి సరిగా లేదు. భర్త రామాంజనేయులుతో గొడవపడి పుట్టినిల్లయిన తుమ్మిగనూరు వెళ్లింది. బుధవారం సాయంత్రం తన పది నెలల కుమారుడు విశ్వనాథ్‌ను ఎత్తుకుని తుంగభద్ర పాత రైల్వేస్టేషన్ సమీపంలోకి వెళ్లి చిన్నారి గొంతు నులిమి చంపేసింది. ఆ తర్వాత ఎదురుగా వస్తున్న గూడ్స్ రైలు కింద పడి ఆత్మహత్య చేసుకోడానికి వెళ్లింది. సరిగ్గా ఆ సమయానికి హనుమంతమ్మను వెతుక్కుంటూ అక్కడికి చేరుకున్న కుటుంబ సభ్యులు, స్థానికులు ఆమెను అడ్డుకున్నారు. అయితే.. తల్లి చంకలో విగతజీవిగా ఉన్న విశ్వనాథ్‌ను చూసి కుటుంబ సభ్యులు బోరున విలపించారు. మానసికస్థితి లేక కన్న తల్లి చేజేతులా బిడ్డను దూరం చేసుకున్న విషాదంలో దేవరబెట్ట గ్రామం మునిగిపోయింది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేయలేదు.

రైతు వ్యవసాయ పంపు సెట్లకు విద్యుత్ కనెక్షన్

కల్లూరు, జూన్ 26: ఉమ్మడి కర్నూలు జిల్లాలో రుసుం చెల్లించిన 8532 వ్యవసాయ పంపుసెట్లకు విద్యుత్ కనెక్షన్ పనులు పూర్తి చేయనున్నట్లు ఆ శాఖ ఎస్‌ఈ ఎం.ఉమాపతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు 25-6-2024 వరకు రుసుం చెల్లించిన వారికి విద్యుత్ పనులు పూర్తి చేసేందుకు సన్నాహాలు జరుగుతున్నాయని సూచించారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కోడ్ కారణంగా కొత్తగా వ్యవసాయ కనెక్షన్‌లకు అప్లై చేసుకున్న రైతులకు డిమాండ్ నోటీసులు, శాంక్షన్ పత్రాలు ఆపి ఉన్నారు. కోడ్ పూర్తైన మేరకు వెంటనే వీటిని తక్షణమే శాంక్షన్ చేసి డిమాండ్ నోటీసులు పంపమని ఆదేశాలు వచ్చాయని ఎస్‌ఈ ఉమాపతి తెలిపారు.

దాడి చేసిన వ్యక్తులపై కేసు నమోదు

మిడుతూరు, జూన్ 26: మిడుతూరు మండలంలోని పీరు సాహేబ్ పేట గ్రామంలో మంగళవారం జరిగిన ఘర్షణలో ఇరు వర్గాలకు చెందిన వ్యక్తులపై బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ జగన్ మోహన్ తెలిపారు. వెంకట రమణ, మధుకుమార్, మధు గోపాల్, శివ మధు, మధు కృష్ణ, రామకృష్ణ అనే వ్యక్తులు పాత కక్షలు మనసులో పెట్టుకుని మంగళవారం సాయంత్రం పీరుసాహెబ్ పేట గ్రామంలో నరసమ్మ, రవణమ్మ, శివ, వడ్డె లక్ష్మీ నారాయణ, ఆంజనేయులుపై కర్రలతో దాడి చేశారు. ఈ ఘటనలో గాయపడిన రవణమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు దాడి చేసిన వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ విషయంపై ఎస్ఐ జగన్ మోహన్ ఇరు వర్గాలకు కౌన్సిలింగ్ ఇచ్చారు.

మత్తు పదార్థాల జోలికి వెళితే చర్యలు



అవగాహన ర్యాలీలో ప్రతిజ్ఞ చేయిస్తున్న పోలీసులు

కర్నూలు, జూన్ 26: గంజాయి తదితర మత్తు పదార్థాలు అక్రమ రవాణా, విక్రయాల జోలికి వెళితే చర్యలు తీసుకుంటామని అడిషనల్ ఎస్పీ నాగరాజు హెచ్చరించారు. బుధవారం ఎస్పీ జి.కృష్ణకాంత్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా యాంటి డ్రగ్స్ డే పురస్కరించుకుని ర్యాలీలు, అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ ర్యాలీ స్థానిక కంట్రోల్ రూమ్, ఎగ్జిబిషన్ గ్రౌండు నుంచి ర్యాలీ ప్రారంభమై కొండారెడ్డి బురుజు వరకు సాగింది. అక్కడ మానవహారం ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ మాట్లాడుతూ విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిసై జీవితాలు బుగ్గి పాలు చేసుకోకుండా మంచి చదువులు చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సెబ్ సూపరింటెండెంట్ రవి కుమార్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ సుధీర్‌బాబు, డీఎస్పీ విజయశేఖర్, సెబ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ వినోద్ కుమార్, ట్రాఫిక్ సీఐ గౌతమి, ఒకటో పట్టణ సీఐ పవన్ కుమార్, తాలుకా సీఐ శ్రీధర్, సెబ్ సీఐ రాజేంద్రప్రసాద్, డీటీఎఫ్ సీఐ నరసనాయుడు, విద్యార్థులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



జవాజీ దాసు మృతదేహం

మహానంది, జూన్ 26: మహానంది మండలం గాజులపల్లి ఆర్ఎస్‌కు చెందిన జవాజీ దాసు(62) బుధవారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. . గాజులపల్లి రైల్వే స్టేషన్ సమీపంలోని ప్రధాన రైల్వే గేటు వద్దకు నడిచి వస్తున్న దాసును గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఆయన తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే దాసు మృతి చెందాడు. మహానంది పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

బాలిక అదృశ్యం

చాగలమర్రి, జూన్ 26: మండలంలోని ఓ గ్రామానికి చెందిన 14 ఏళ్ల బాలిక అదృశ్యమైనట్లు తండ్రి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశామని ఎస్ఐ రమణయ్య బుధవారం తెలిపారు. బాలిక ఈనెల 25వ తేదీ ఉదయం ఇంటి నుంచి చెప్పకుండా వెళ్లిపోయిందని, తిరిగి ఇంటికి రాలేదని, ఈ మేరకు తండ్రి ఫిర్యాదు చేయడంతో దర్యాప్తు చేస్తున్నామని అన్నారు.

చెక్‌బౌన్స్ కేసులో జైలు, జరిమానా

కర్నూలు(లీగల్), జూన్ 26: అప్పు తీసుకొని, బదులుగా చెల్లని చెక్కు ఇచ్చిన ఒక ఆర్‌ఎంపీ డాక్టర్‌కు ఏడాది జైలు, రూ.3.50 లక్షల జరిమానా విధిస్తూ కర్నూలు అదనపు జ్యూడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ టి. జ్యోత్స్నా దేవి బుధవారం తీర్పు చెప్పారు. కర్నూలు చెందిన ఫిర్యాది ఎస్. గోకారి బాషా నుంచి గద్వాల జిల్లా ఉండవల్లికి చెందిన ఒక ఆర్‌ఎంపీ డాక్టర్ ఎస్. మహబూబ్ బాషా 2018లో తన ఇంటి అవసరాల కోసం రూ.2.10 లక్షలు అప్పు తీసుకున్నాడు. ఆ తర్వాత రూ.1.75 లక్షలకు తన బ్యాంకు చెక్కు ఇచ్చాడు. ఆ చెక్కును బ్యాంకు ద్వారా వసూలుకు పంపగా.. ఖాతాలో తగిన నిల్వలు లేకపోవడంతో అది బౌన్స్ అయింది. దీంతో ఫిర్యాది కోర్టులో కేసు దాఖలు చేశాడు. నిందితునిపై నేరం రుజువు కావడంతో జైలు, జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని జింక మృతి



మృతి చెందిన జింక

గూడూరు, జూన్ 26: గుర్తు తెలియని వాహనం ఢీకొని జింక మృతి చెందిన సంఘటన కె నాగలాపురం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకొంది. బుధవారం గూడూరు మండలం కె. నాగలాపురం సమీపంలో జింకను గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో జింక మృతి చెందింది. ఫారెస్ట్ అధికారులకు మృతి చెందిన జింకను అప్పగించినట్లు కె.నాగలాపురం పోలీసులు తెలిపారు.

ఆంధ్రజ్యోతి చిన్న ప్రకటన - పెద్ద స్పందన CLASSIFIEDS

PLOT FOR SALE

R.R. రియల్ ఎస్టేట్ కర్నూలు-జీన్ రోడ్డు దూపాడు రిడ్జ్ స్కూల్ దగ్గర (30x50) (30x40) సైజులు గల Open ప్లాట్స్ మరియు బళ్లారి చౌరస్తా దగ్గర 3 (BHK) ప్లాట్స్ అమ్మకానికి కలవు. సంప్ర: 91828 21014. AJL-186377

CHANGE OF NAME

I, AMTUL ALEEM (Old Name) R/o.H.No: 41-254, Kotha Peta, Kurnool dist, AP., have changed my name as AMTUL ALEEM SHAHUL HAMID (New Name) W/o.SHAHUL HAMID AJL-186289

CHANGE OF NAME

I, MOHAMMED ARSHAD S/o.ABDUL WAHEED (Old Name) R/o.H.No:32-227-A, Gadda, Kurnool dist, AP., have changed my name as SHAIK MOHAMMED ARSHAD (New Name) S/o.ABDUL WAHEED AJL-186289

CHANGE OF NAME

I, Khande Ravi Theja S/o.Khande Harinath (Old Name) R/o:25-396G2, Priyanka Nagar, Nandyal dist, AP., Here by State That I Have Changed My Name known as Khande Ravi Teja S/o.Khande Harinath (New Name) AJL-186289

CHANGE OF NAME

I, Kotha Lakshmi Deepthi W/o.Khande Ravi Theja (Old Name) R/o:25-396G2, Priyanka Nagar, Nandyal dist, AP., Here by State That I Have Changed My Name known as Khande Lakshmi Deepthi W/o.Khande Ravi teja (New Name) AJL-186289

PASSPORT MISSING

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడమేమనగా నేను Munaganuri Siva Ganesh Kumar S/o M.S.Panduranga Rao, నా పాస్‌పోర్ట్ నెంబర్. G3225075. జారీచేసిన తేది 03.05.2007 పోగొట్టుకొని పోయినది. కర్నూలు మండలంలోని కర్నూలు పట్టణం నందు కలెక్టరు ఆఫీసుకు వెళ్లేటప్పుడు ఆటోలో పోయినది. కావున పై పాస్‌పోర్ట్ ఎవరికైనా దొరికినచో క్రింద అడ్రసుకు ఇవ్వగలరు. వారికి తగిన పారితోషికం ఇస్తాము. ఇంటి నెం.50-184-డి, అరోరా నగర్, బి-క్యాంప్, కర్నూలు, ఆంధ్రప్రదేశ్-518002. సెల్ నెంబర్: 91333 02173 AJL-186223

PASSPORT MISSING

I, KATTUBADI SHAFI BASHA S/o.KATTUBADI HUSSAIN SAHEB, R/o.H.No:45-24-180-2, Ashok Nagar, kurnool dist, AP., have lost my Indian original passport bearing No: M728626, has been lost by me while kurnool over flowed water of tungabhadra River and Handri River during the floods on 02-10-2009 that my house was submerged in the floods and drifted my passport. if found by anyone please inform to the above address. AJL-186289

బంగారం కొనబడును

మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్, షిఫ్టింగ్ చేయబడును.(రిటైర్డు పోలీస్ డిపార్టుమెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ. సంప్ర: 7382114647 AJA-189265

FOR ADVERTISEMENTS CONTACT. Cell: 99854 11369

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన/క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటన దారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు. మేనేజర్ - ఏడివిటి



ఉపాధి పనులపై సామాజిక తనిఖీ

గోస్పాడు, జూన్ 26 : మండలంలో 2023 -2024 సంవత్సరానికి గాను జరిగిన ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ చేపట్టినట్లు ఎంపీడీవో నాగ అనసూయ, ఏపీవో జ్యోతి తెలిపారు. ఇప్పటికే కొన్ని గ్రామాల్లో సామాజిక తనిఖీలు పూర్తి చేసి గ్రామ సభలు నిర్వహించామని అన్నారు. జూలై 3వ తేదీన మండల స్థాయిలో సామాజిక బహిరంగ సభ ఏర్పాటు చేస్తామని, ఉపాధిలో అవకతవకలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు చేపట్టతామని అన్నారు.

సీఎంను విమర్శిస్తే ఊరుకోం

పాములపాడు, జూన్ 26 : గడచిన ఐదు సంవత్సారాల గత ప్రభుత్వ పాలనలో అధికారం అడ్డుపెట్టుకొని అవినీతికి పాల్పడిన వారు సీఎం చంద్రబాబునాయుడిని విమర్శిస్తే ఊరుకోమని పాములపాడు మండల తెలుగు యువత అధ్యక్షుడు మధుక్రిష్ణ అన్నారు. వలంటీర్లను విధుల్లోకి తీసుకోవాలి అంటూ వైసీపీ నాయకుడు చంద్రబాబును విమర్శించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారం అడ్డం పెట్టుకొని అంగన్‌వాడీ టీచర్లు, ఆయా పోస్టులను అమ్ముకొని లక్షలు దండుకున్న మీరు టీడీపీని విమర్శిస్తారా? ఇలాంటి చూడలేకనే ప్రజలు తగిన బుద్ధి చెప్పారన్నారు. ఎక్కడెక్కడ వారు అవినీతికి పాల్పడ్డారో బయటకు తీస్తామని అన్నారు.

టీడీపీ నాయకుడికి సత్కారం


రమణమూర్తికి మొక్క అందజేస్తున్న ఎస్సీ కాలనీ వాసులు

పాణ్యం, జూన్ 26 : పాణ్యం ఎస్సీ కాలనీలో మూడు నెలలుగా తాగు నీటి సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. విషయం తెలుసుకున్న టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రమణమూర్తి సొంత డబ్బుతో బోరు వేయించి సమస్యను తీర్చారు. బుధవారం కాలనీ వాసులు ఆయనను సత్కారించారు. తాగునీటి సమస్య తీర్చడంతో హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నాయకులు ప్రతాప్, వెంకటాద్రి, చిరంజీవి, రజా, సతీష్, సుంకన్న, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

రుణాలు వసూలు చేయకపోతే జీతాలు నిలుపుదల

జూపాడుబంగ్లా, జూన్ 26: పొదుపులక్ష్మి గ్రూపు మహిళలు తీసుకున్న సీఐఎఫ్, వీఆర్ఎఫ్, ఎస్సీ సబ్‌ప్లాన్ కింద తీసుకున్న రుణాలను రికవరీ చేయకపోతే వీవోఏల జీతాలు నిలుపేస్తామని వెలుగు ఏరియా కోఆర్డినేటర్ డేగలయ్య అన్నారు. వెలుగు కార్యాలయంలో బుధవారం ఏపీఎం అంబమ్మ ఆధ్వర్యంలో వీవోఏలకు సమీక్షా సమావేశం జరిగింది. అన్నిరకాల లావాదేవిలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌చేయాలని సీసీలకు, వీవోఏలకు సూచించారు. ప్రకృతి వ్యవసాయంపై ఆసక్తిగల రైతులకు ప్రధానపంట విత్తుకు ముందే విత్తనాలు అందేలా ఇవ్వనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో వెలుగు సీసీలు నాగన్న, నాగేశ్వరరావు, ధన్సింగ్‌నాయక్, జయలక్ష్మి, జయపాల్, వీవోఏలు పాల్గొన్నారు.

సరళమైన పద్ధతిలో బోధించాలి

గడివేముల, జూన్ 26: విద్యార్థులకు సరళమైన పద్ధతిలో బోధించేలా చర్యలు తీసుకోవాలని ఎంఈవోలు మేరి సునీత, విమలా వసుంధరాదేవి ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో బుధవారం ప్రధానోపాధ్యాయులతో సమావేశమయ్యారు. ఈ వారు మాట్లాడుతూ విద్యార్థులకు అర్థమయ్యే పద్ధతిలో బోధించి వారి అభ్యున్నతికి కృషి చేయాలని అన్నారు. అనంతరం నిజామ్ ఇన్‌స్టిట్యూట్ నుంచి వచ్చిన ఫిజియోథెరపీ వైద్యులు ఫిజియోథెరపీ వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. వివిధ రకాల వ్యాయామాల గురించి అవగాహన కల్పించారు. వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు అంగన్‌వాడీల అభినందనలు


గౌరు దంపతులను సన్మానిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

గడివేముల, జూన్ 26: పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరితకు గడివేముల అంగన్‌వాడీ కార్యకర్తలు, సూపర్‌వైజర్లు శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం అంగన్‌వాడీ కార్యకర్తలు, సూపర్‌వైజర్లు ఎమ్మెల్యే గౌరుచరితను, నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జి గౌరు వెంకట్‌రెడ్డిలను కలిశారు. అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే గౌరుచరిత మాట్లాడుతూ అంగన్‌వాడీల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు దేశం సత్యనారాయణ రెడ్డి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు జయలక్ష్మి, కళావతి పాల్గొన్నారు.

చేపల పెంపకంపై అవగాహన

గడివేముల, జూన్ 26: మండలంలోని మంచాలకట్ట గ్రామంలో బుధవారం మత్స్య సహకార సంఘ సభ్యులకు మత్స్య సాగుబడిపై మత్స్యశాఖ అభివృద్ధి అధికారి కెవీ భరత్‌లాల్ నాయక్ అవగాహన కల్పించారు. చేపల పెంపకంలో గల నూతన విధానాలను వివరించారు. కార్యక్రమంలో గ్రామ మత్స్య సహాయకులు చంద్రమోహన్, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ఈవోపై చర్యలు తీసుకోవాలి

కొత్తపల్లి, జూన్ 26: కొలనుభారతి పుణ్యక్షేత్రానికి ఇన్‌చార్జి ఈవోగా విధులు నిర్వహిస్తున్న మోహన్ తనను మానసికంగా వేధిస్తున్నాడంటూ కొలనుభారతి అర్చకులు చక్రపాణి శర్మ ఆరోపించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ 2009 నుంచి క్షేత్రంలో అర్చకులుగా విధులు నిర్వహిస్తున్న తనపై ఈవో కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతూ ఏకపక్షంగా నిర్వహిస్తున్నాడని ధ్వజమెత్తారు. గత 15 సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్న తనకు సరిపడ విధులు కల్పించకుండా క్షేత్రంలో విధులు నిర్వహిస్తున్న కొందరు పురోహితులతో పాటు అక్కడ దినసరి వేతనం కింద విధులు నిర్వహిస్తున్న వారి మాటలను విని తనకు అన్యాయం చేస్తున్నాడని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై క్షేత్ర ఈవో మోహన్‌ను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా.. తనపై అర్చకులు చక్రపాణి శర్మ లేనిపోని ఆరోపణలు చేస్తున్నాడని, అతను చెప్పినదాంట్లో ఎలాంటి నిజం లేదని వివరణ ఇచ్చారు.

ఉపాధి పనులపై సామాజిక తనిఖీ

గోస్పాడు, జూన్ 26 : మండలంలో 2023 -2024 సంవత్సరానికి గాను జరిగిన ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ చేపట్టినట్లు ఎంపీడీవో నాగ అనసూయ, ఏపీవో జ్యోతి తెలిపారు. ఇప్పటికే కొన్ని గ్రామాల్లో సామాజిక తనిఖీలు పూర్తి చేసి గ్రామ సభలు నిర్వహించామని అన్నారు. జూలై 3వ తేదీన మండల స్థాయిలో సామాజిక బహిరంగ సభ ఏర్పాటు చేస్తామని, ఉపాధిలో అవకతవకలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు చేపట్టతామని అన్నారు.

SV ITI COLLEGE
బొమ్మలసత్రం, కర్నూలు రోడ్, నంద్యాల.
భారత ప్రభుత్వ గుర్తింపు పొందిన సంస్థ
I.T.I. అడ్మిషన్లు జరుగుచున్నవి.
ట్రేడ్స్: హెల్త్ శానిటరి ఇన్‌స్పెక్టర్, డీజిల్ మెకానిక్, ఎలక్ట్రీషియన్, మోటర్ మెకానిక్, ఎలక్ట్రానిక్స్ మెకానిక్, ఫిట్టర్ మరియు డ్రాఫ్ట్స్‌మన్ సివిల్.
సెల్: 98486 06835

పెద్దకర్మ

మంచికి మారుపేరుగా నిలిచి, మాకు ఆత్మీయతానురాగాలను పంచి మమ్మల్ని ఆదర్శవంతులుగా తీర్చిదిద్ది, కుటుంబ అభివృద్ధికై నిరతంతరం శ్రమించి, మా అందరి హృదయాలలో సుస్థిర స్థానం సంపాదించుకున్న మా నాన్నగారైన కీ.శే. టేకూరి క్రిష్ణుడు గారి మరణం మాకు తీరనిలోటు. మీ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతుని ప్రార్థిస్తూ... శోకతప్త హృదయాలతో...
కీ.శే. టేకూరి క్రిష్ణుడు గారు
టీడీపీ నాయకులు, వేంపెంట గ్రామం, పాములపాడు మం.
జననం : 01-01-1955, మరణం : 17-06-2024
భార్య : టేకూరి రామసుబ్బమ్మ, మాజీ సర్పంచ్ మనుమళ్లు : కుందన్, యువ
కుమారుడు : టేకూరి నాగేశ్వరరావు (నాగేష్) (సింగపూర్) కోడలు : రేణుక
గమనిక : 27-06-2024వ తేదీ గురువారం నాడు వేంపెంట గ్రామంలోని మా స్వగృహం నందు పెద్దకర్మ నిర్వహించబడును. సెల్ : 80086 24374.

ఇలా ఉంటే ఎలా తింటారు?

- పాఠశాలను తనిఖీ చేసిన ఎమ్మెల్యే గిత్తా జయసూర్య
- భోజనం సరిగా ఉండడం లేదని విద్యార్థుల ఫిర్యాదు
- మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులపై ఎమ్మెల్యే ఆగ్రహం


గుడ్డును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే


విద్యార్థితో కలిసి గుడ్డు తింటున్న దృశ్యం

నందికొట్కూరు, జూన్ 26: నాణ్యత లేని భోజనం అందిస్తే విద్యార్థులు ఎలా తింటారని వంట ఏజెన్సీ నిర్వాహకులను ఎమ్మెల్యే గిత్తా జయసూర్య ప్రశ్నించారు. నందికొట్కూరు పట్టణంలోని గాంధీ మెమోరియల్ పాఠశాలను బుధవారం నందికొట్కూరు ఎమ్మెల్యే అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్నభోజన పథకాన్ని ఎమ్మెల్యే పరిశీలించారు. ఎమ్మెల్యే పరిశీలిస్తూ కలర్‌రైస్‌ను ముద్దగా చేశారని, ఆలూ కుర్మా అంటారా...ఇది ఆలూ సాంబర్‌లా నీళ్ల నీళ్ల ఉందంటూ నిర్వాహకులపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి భోజనాన్ని మీ ఇంటో మీరు వండుకుంటారా అంటూ ప్రధానోపాధ్యాయులుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులతో పాటు ఎమ్మెల్యే కలిసి భోజనం చేశారు. భోజనం ఎలా ఉందని ఎమ్మెల్యే విద్యార్థులను ప్రశ్నించగా...ఉడికీఉడకని అన్నాని వడ్డిస్తున్నారని, భోజనం చేసిన తర్వాత కడుపు నొప్పి వస్తుందని విద్యార్థులు ఎమ్మెల్యే ముందు వాపోయారు. మరి కొందరు విద్యార్థులు భోజనం సరిగా ఉండక పోవడం వల్ల ఇంటి నుంచి క్యారేజ్‌లు తెచ్చుకొని తింటున్నామన్నారు. ఇలా అయితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సుధాకర్‌రెడ్డి, మున్సిపల్ డీఈ నాయబ్ రసూల్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, ముర్తుజావళి, వేణుగోపాల్, మల్లికార్జున, నిమ్మకాయల రాజు, రాజన్న పాల్గొన్నారు.

● ఆక్రమణలకు పాల్పతే ఎవ్వరినీ ఉపేక్షించం:

నందికొట్కూరు పట్టణంలోని మున్సిపాల్టీకి సంబంధించిన స్థలాలను ఆక్రమించేందుకు ప్రయత్నిస్తే ఎంతటివారినైనా ఉపేక్షించేది లేదని ఎమ్మెల్యే అన్నారు. బుధవారం పట్టణంలోని పాండురంగస్వామి దేవాలయం వద్ద ఆక్రమణకు గురైన మున్సిపాలిటీ స్థలాన్ని ఆయన పరిశీలించారు. దేవాలయం ముందున్న స్థలం ఎవరి పేరుమీద ఉందో వారిని పేపర్లు తీసుకొని రావాలని కమిషనర్‌ను ఆదేశించారు. మిగిలిన ప్రదేశంలో ఎవ్వరూ కూడా ఎలాంటి షెడ్లు వేయకూడదని, వేసిన వాటిని వెంటనే తొలగించాలని ఆయన మున్సిపల్ అధికారులను ఆదేశించారు. గత ప్రభుత్వంలో గత మున్సిపల్ కమీషనర్‌కు రూ.2 లక్షలు... టీపీవోకు రూ.లక్ష ఇచ్చి మున్సిపాల్టీ స్థలాలను కొందరు అక్రమార్కులు ఆక్రమించుకున్నారని ఆరోపించారు. టీడీపీ హయాంలో అలాంటి కార్యక్రమాలను ఉపేక్షించదన్నారు. ఇప్పటికే కొన్ని స్థలాలు ఆక్రమణకు గురైనట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. పట్టణంలోని మున్సిపాల్టీ స్థలాలు ఎక్కడెక్కడ ఉన్నాయి? ప్రస్తుత వాటి పరిస్థితి ఏమిటి అన్న వివరాల నివేదికలను తనకు అందజేయాలని ఆయన మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ పాండురంగస్వామి దేవాలయం ముందు అక్రమంగా నిర్మించిన గోడను వెంటనే తొలగించే ఏర్పాట్లు చేయాలని టౌన్ ప్లానింగ్ సిబ్బందిని ఆదేశించారు.

సమస్యలు పరిష్కరిస్తా: ఎమ్మెల్యే బుడ్డా



మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి

శ్రీశైలం, జూన్ 26: నియోజకవర్గ సమస్యలు పరిష్కరించేందుకు ప్రత్యేకంగా దృష్టి సారించినట్లు ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి అన్నారు. బుధవారం శ్రీశైలంలోని ఎస్సీ కాలనీలో ఓట్ ఫర్ థ్యాంక్స్ కార్యక్రమంలో భాగంగా పర్యటించారు. ఈ సందర్భంగా మహిళలతో ముఖాముఖి అయిన ఎమ్మెల్యే తనను గెలిపించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. కాలనీ సమస్యలను త్వరలో పరిష్కస్తానని హామీ ఇచ్చారు. సాయంత్రం సుండిపెంట కాలనీలో ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డికి కూటమి నాయకులు ఘన స్వాగతంతో పాటు విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. సుండిపెంట గ్రామంలో శాశ్వతంగా తాగునీటి సమస్యను పరిష్కారిస్తానని తెలిపారు.

● అంతర్జాతీయ మాదక ద్రవ్యాల నివారణ దినోత్సవం సందర్భంగా శ్రీశైలం పురవీధుల్లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద ర్యాలీని ప్రారంభించారు. రాష్ట్రప్రభుత్వం మాదక ద్రవ్యాల నివారణకై ప్రత్యేక దృష్టి పెట్టిందని ఎమ్మెల్యే బుడ్డా అన్నారు. అనంతరం సీఐ ప్రసాదరావు మాట్లాడుతూ మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండి భవిష్యత్‌ను కాపాడుకోవాలని అన్నారు.

ఉపాధ్యాయ వృత్తికే వన్నె తెచ్చారు: డీఎస్పీ

- రిటైర్డు ఎంఈవో జానకీరామ్‌కు ఘన సన్మానం


మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసరావు

ఆత్మకూరు, జూన్ 26: ఆత్మకూరు మండల విద్యాశాఖాధికారిగా పనిచేసి ఇటీవల పదవీ విరమణ పొందిన జానకీరామ్ ఉపాధ్యాయ వృత్తికే వన్నె తెచ్చారని ఆత్మకూరు డీఎస్పీ శ్రీనివాసరావు, నంద్యాల డిప్యూటీ డీఈవో మహ్మద్‌బేగ్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక చౌడేశ్వరీ కళ్యాణ మంటపం నందు పదవీ విరమణ పొందిన ఆత్మకూరు ఎంఈవో-1 జానకిరామ్‌కు ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో సన్మాన సభను నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. 34ఏళ్ల సుదీర్ఘకాలం పాటు విద్యారంగంలో వివిధ హోదాల్లో అంకితభావం, నిబద్ధతతో రిటైర్డు ఎంఈవో జానకిరామ్ పనిచేశారని చెప్పారు. అనంతరం సన్మాన గ్రహీత రిటైర్డు ఎంఈవో జానకీరామ్ మాట్లాడుతూ.. తాను మండల విద్యాశాఖాధికారిగా పనిచేసినంత కాలం ఏ రోజు ఉపాధ్యాయుల పట్ల దురుసుగా వ్యవహరించలేదని, అందరితో అప్యాయంగా మెలిగి వారందరి సహకారంతోనే విధులు రాణించగలిగానని తెలిపారు. కార్యక్రమంలో ఆత్మకూరు అర్బన్, రూరల్ సీఐలు లక్ష్మీనారాయణ, నాగభూషణ్, ఎస్ఐ వెంకటనారాయణ, మున్సిపల్ కమిషనర్ హరిప్రసాద్, ఎంపీడీవో శివప్రసాద్‌వర్మ, సూపరిన్‌డెంట్ మోహన్‌కుమార్, ఆత్మకూరు, కొత్తపల్లి, పాములపాడు, బేతంచెర్ల ఎంఈవోలు బాలాజీనాయక్, శ్రీరాములు, హినయతుల్లా, సోమశేఖర్, రిటైర్డు రామకృష్ణుడు, ఏపీటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు కమతం శంకర్, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వడ్డీలేని రుణాలు మంజూరు చేయాలి


ఎస్‌బీఐ మేనేజర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఏపీ రైతు సంఘం నాయకులు

నందికొట్కూరు, జూన్ 26: రైతులు, కౌలు రైతులకు వడ్డీలేని రుణాలను మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని సీపీఐ ఏపీ రైతు సంఘం జిల్లా నాయకుడు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. బుధవారం సీపీఐ ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో నందికొట్కూరు ఎస్.బి.ఐ బ్యాంక్ మేనేజర్ రఘునాథ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏపీ రైతు సంఘం జిల్లా నాయకుడు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రభుత్వాలు రైతులకు అండగా ఉండి రైతులు నష్టపోకుండా ఆర్థిక భరోసా ఇవ్వాలని, బ్యాంకుల ద్వారా రుణాలు మంజూరు చేసి రైతులకు బ్యాంకుల ద్వారా ట్రాక్టర్లు సబ్సిడీ ద్వారా యంత్ర పరికరాలు ఇచ్చి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రైతులకు కౌలు రైతులకు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ కింద క్రాప్ లోన్, ఎకరాకు రూ.లక్ష రుణం అందించాలని, కౌలు రైతులకు, రైతులకు రూ.3 లక్షల వరకు సున్నా వడ్డీ కింద రుణాలు మంజూరు చేయాలని, ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలకు రాజకీయ పార్టీలతో సంబంధం లేకుండా చనిపోయిన కుటుంబానికి రూ.20 లక్షల పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం తాలుకా నాయకులు కాటే పోగు సోమన్న, శేఖర్, ఇజ్రాయిల్, సుధాకర్, మౌలాలి, సత్యం తదితరులు పాల్గొన్నారు.

మల్లన్న సన్నిధిలో సోమిశెట్టి


ఆలయ ప్రాంగణంలో సోమిశెట్టి తదితరులు

శ్రీశైలం, జూన్ 26: శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లను బుధవారం టీడీపి నేత సోమిశెట్టి వెంకటేశ్వర్లు దర్శించుకున్నారు. స్వామివారికి రుద్రాభిషేకం, భ్రమరాంబికాదేవి అమ్మవారికి కుంకుమార్చన జరిపించుకున్నారు. ఆయన వెంట ఆర్యవైశ్య సంఘం నాయకులు ఐతా మార్కండేయులు, పొట్టి చిన్న సుబ్బయ్య, టీడీపి నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మించాలి



వెలుగోడులో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, పోలీసులు

ఆత్మకూరు, జూన్ 26: డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మించేందుకు ప్రజలందరు సంఘటితంగా కృషిచేయాలని ఆత్మకూరు డీఎస్పీ శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఈమేరకు బుధవారం మాదకద్రవ్యాల నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకుని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో, పోలీసుశాఖ ఆధ్వర్యంలో విద్యార్థుల కలిసి ఆత్మకూరు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం గౌడ్‌సెంటర్‌లో మానవహారంగా ఏర్పడి మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ.. పొగాకు, గంజాయి తదితర మత్తు పదార్థాల వల్ల తీవ్ర దుష్పలితాలు ఉంటాయని పేర్కొన్నారు. అదేవిదంగా ఎక్కడైనా మాదక ద్రవ్యాల విక్రయాలు జరిగితే డయల్ 100 లేదా మాదక ద్రవ్యాల కంప్లైంట్ ప్రత్యేక నంబర్ 14500కు సమాచారం ఇవ్వాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో కలిసి డ్రగ్స్ నిర్మూలనకై ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు రూరల్, అర్బన్ సీఐలు లక్ష్మీనారాయణ, నాగభూషణ్, సెబ్ సీఐ మారుతీరావు, మున్సిపల్ కమిషనర్ హరిప్రసాద్, ఎస్ఐ వెంకటనారాయణరెడ్డి తదితరులు ఉన్నారు.

పాములపాడు: మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని డ్రగ్స్ ద్వారా జీవితాలు నాశనం అవుతాయని వినాదాలు చేస్తూ విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు బుధవారం పాములపాడులోని ఎఎస్ఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు మారకద్రవ్యాలపై పాఠశాల నుంచి బస్టాండు వరకు ఎఎస్ఐ ఏసయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయులు గోపాల్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు.

వెలుగోడు: యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని తమ జీవితాలను తీర్చిదిద్దుకోవాలని మోతుకూరు వైద్యధికారి సుధా ప్రణతి, వెలుగోడు ఏఎస్ఐలు షాషావలి, ఉపేంద్ర అన్నారు. బుధవారం అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని వెలుగోడు పట్టణంలో పోలీసు, వైద్యులు, విద్యార్థులతో కలిసి ర్యాలి నిర్వహించారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ నూర్ అహ్మద్ సుధాకర్, సిబ్బంది మద్దిలేటి నాయక్, ప్రేమలత, వెంకటరామిరెడ్డి, రామ్‌నాయక్, లక్ష్మణ్ నాయక్, వైద్య సిబ్బంది సౌందర్య ,విద్యార్థులు పాల్గొన్నారు.

నందికొట్కూరు: 26వ అంతర్జాతీయ మాదకద్రవ్యాల నిర్మూలన దినోత్సవం సందర్భంగా పట్టణంలో పోలీస్‌శాఖ, ఎక్సైజ్‌శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్, ఎక్సైజ్‌శాఖల ఆధ్వర్యంలో పట్టణంలోని కొత్తబస్టాండ్ నుంచి పటేల్ సెంటర్ మీదుగా శాంతిధియేటర్ వరకు, అక్కడి నుంచి కురువ వీధి, బీఎస్ఎన్ఎల్ కార్యాలయం మీదుగా నంది జూనియర్ కళాశాల వరకు ఆ కళాశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సుధాకర్‌రెడ్డి, పట్టణ సీఐ ప్రకాష్ కుమార్, ఎక్సైజ్‌శాఖ సీఐ సీతారామిరెడ్డి, ముచ్చుమర్రి ఎస్.ఐ జయశేఖర్, నంది జూనియర్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.


ఆత్మకూరులో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసరావు


పాములపాడు బస్టాండులో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు


నందికొట్కూరు పట్టణంలో ర్యాలీ

వేలం ఆదాయం రూ10.42 లక్షలు

నంద్యాల రూరల్, జూన్ 26: నంద్యాల మండలంలోని చాబోలు గ్రామంలోని వేణుగోపాలస్వామి, నాగేశ్వరస్వామి దేవాలయ మాన్యం భూములకు కౌలు వేలం నిర్వహించారు. ఈ వేలంలో రూ10.42 లక్షలు ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి స్వర్ణముఖి తెలిపారు. బుధవారం బండిఆత్మకూర్ గ్రూప్ దేవాలయాల కార్యనిర్వాహణాదికారి నాగప్రసాద్ పర్యవేక్షణలో వేలం పాట నిర్వహించారు. వేణుగోపాల్‌స్వామికి చెందిన 28 ఎకరాలు, నాగేశ్వరస్వామికి చెందిన 20 ఎకరాల భూములకు వేలం నిర్వహించినట్లు తెలిపారు.

సీజనల్ వ్యాధులపై ముందస్తు చర్యలు తీసుకోవాలి

కొత్తపల్లి, జూన్ 26: కొత్తపల్లి మండలంలో ఉన్న పలు గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా మండల స్థాయి అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని సీపీఎం మండల నాయకులు ఎన్.స్వాములు, ఎస్.సంజీవరాయుడు తెలిపారు. వారు మాట్లాడుతూ మండలంలోని శివపురం, సింగరాజుపల్లి, గుమ్మడాపురం తదితర గ్రామాల్లో వాంతులు, విరేచనాలతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారన్నారు. సంబంధిత ప్రభుత్వ అధికారులు సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. మురుగు కాలువలను శుభ్రం చేయించి బ్లీచింగ్ పౌడర్ చల్లించి దోమల నివారణ చేపట్టాలన్నారు. అలాగే ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు వాటర్‌ట్యాంకును శుభ్రం చేయించి కోలరినేషన్ చేసిన నీటిని సరఫరా చేయాలని తెలిపారు.

స్వచ్ఛమైన తాగు నీటిని అందించండి

నంద్యాల రూరల్, జూన్ 26: గ్రామాల్లో స్వచ్ఛమైన తాగునీటిని అందించాలని ఎంపీడీఓ సౌభాగ్యమ్మ అధికారులకు సూచించారు. బుధవారం స్థానిక ఎంపిడీవో కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. రానున్న వర్షాకాల నేపథ్యంలో ఎలాంటి అంటు వ్యాధులు ప్రబలకుండా జాగ్రతలు తీసుకోవాలన్నారు. వీధులన్నీ ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని అన్నారు.

గడివేముల, జూన్ 26: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో బుధవారం జిందాల్ పరిశ్రమ వైద్యులు శరత్‌కుమార్ విద్యార్థులకు సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో దోమల కారణంగా జ్వరాలు ప్రభలే అవకాశం ఉందని అన్నారు. విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. తాగునీటిని వేడి చేసి చల్లార్చి తాగాలని అన్నారు.

పండ్ల మొక్కల పెంపకానికి ప్రాధాన్యం ఇవ్వాలి

కొత్తపల్లి, జూన్ 26: రైతులు తమ పొలాల్లో పండ్ల మొక్కల పెంపకానికి ప్రాధాన్యం ఇవ్వాలని ఎంపీడీవో జవహర్‌బాబు తెలిపారు. బుధవారం కొత్తపల్లిలో ఉపాధి అధికారులతో ఏపీవో రేష్మా ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేశారు. వారు మాట్లాడుతూ గ్రామాల్లో ఉన్న రైతులు తమ వ్యవసాయ పొలాల్లో పండ్ల మొక్కల పెంపకానికి ప్రాధాన్యత ఇస్తే రైతులు ఆర్థిక అభివృద్ధి చెందుతారన్నారు. గ్రామాల్లో పని చేస్తున్న ఉపాధి సిబ్బంది, రైతులతో కలిసి పండ్ల మొక్కల పెంపకం చేసుకునే విధంగా అవగాహన కల్పించాలన్నారు. ఈ సమీక్షలో ఐటీడీఏ ఏపీవో రాజు నాయక్, ఈసీ శ్రీనివాసులు, సీవోలు నాగేశ్వరరావు, బాలాజి నాయక్ పాల్గొన్నారు.

డయేరియాపై అవగాహన

ఆత్మకూరు, జూన్ 26: ఆత్మకూరు పట్టణంలోని 8వ వార్డు పరిధిలో బుధవారం టీడీపీ నాయకులు మొహబతుల్లా ఆధ్వర్యంలో డయేరియాపై ప్రజలకు వైద్య, శానిటేషన్ సిబ్బంది అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శానిటేషన్ సెక్రటరీలు రాఘవ, ప్రసాద్, వెంకట్, ఈశ్వర్, మాలిక్‌లు మాట్లాడుతూ.. ప్రస్తుత సీజనల్ వ్యాధుల దృష్ట్యా ప్రజలు వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాల శుభ్రత తప్పక పాటించాలని సూచించారు. అలాగే తాగునీటి వాడకం పట్ల తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు కాశేశ్వరీబాయి, మల్లేశ్వరీబాయి, ఎన్విరాన్‌మెంట్ ఏఈ ఓబులేష్, ఆశావర్కర్లు సుజాత, కుమారీ, వరలక్ష్మీ, యశోద, వార్డు టీడీపీ నాయకులు షాకీర్, కార్పెంటర్ బాషా, షఫీ, బన్నూరు బహిరూన్ ఉన్నారు.

మెస్ బిల్లులను విడుదల చేయాలి

నంద్యాల (నూనెపల్లె), జూన్ 26: రాష్ట్ర వ్యాప్తంగా 7 నెలల నుంచి పెండింగ్‌లో ఉన్న బీసీ సంక్షేమ హాస్టళ్ళ మెస్ బిల్లులు విడుదల చేయాలని ఏపి నాన్ పొలిటికల్ విద్యార్థి యువజన జెఏసీ నాయకులు రాజునాయుడు, ఓబులేసు, రియాజ్‌లు కోరారు. నంద్యాల నుంచి జెఏసి నాయకులు విజయవాడకు వెళ్లి బీసీ వెల్ఫేర్ శాఖ కార్యాలయంలో అడిసనల్ డైరెక్టర్ చంద్రశేఖర్‌రాజుకు నాయకులు వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో నాయకులు జయరాజు, పత్తి ఓబులేసు, కన్నావెంకట్, ఫనింద్రారెడ్డి పాల్గొన్నారు.

అవకతవకలపై విచారించండి

నంద్యాల (నూనెపల్లె), జూన్ 26: నంద్యాల అసెంబ్లీ నియోజక వర్గ గ్రామాలలో జాతీయ గ్రామీణ ఉపాధి హామి పథకం పనులలో జరిగిన అవకతవకలు, అవినీతిపై విచారణ చేపట్టి, చర్యలు తీసుకోవాలని టీడీపీ నాయకలు మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి కోరారు. బుధవారం జిల్లా డ్వామా పీడీ రామచంద్రారెడ్డిని భూమా కలిసి చర్చించారు.

జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపిక

నంద్యాల (నూనెపల్లె), జూన్ 26: నంద్యాల నంది షైప్స్ బ్యాట్మింటన్ అకాడమిలో ఈ నెల 29, 30 తేదీలలో ఉమ్మడి కర్నూలు జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా అసోషియేషన్ కార్యదర్శి వంశిధర్ బుధవారం తెలిపారు. 29 శనివారం అండర్ 11-13-15వయసు బాల బాలికల విభాగంలో సింగిల్స్, డబుల్స్ విభాగాల్లో పోటీలు జరుగుతాయన్నారు. 30 వతేది ఆదివారం అండర్ 17,19 బాల బాలికల విభాగంతో పాటు సీనియర్ విభాగంలో పురుషలకు స్త్రీలకు పోటీలు ఉంటాయన్నారు. సింగిల్స్, డబుల్స్ విభాగంలో విడివిడిగా పోటీలు నిర్వహించి జిల్లాజట్లకు ఎంపిక చేస్తామన్నారు. ఎంపికైన జట్లు రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రాతినధ్యం వహిస్తారన్నారు. 28 తేదీ సాయంత్రం 5 గంటలలోపు 8985809434లను సంప్రదించి తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

లోక్‌సభ స్పీకర్‌ను కలిసిన ఎంపీ బైరెడ్డి శబరి


స్పీకర్‌తో బైరెడ్డి శబరి

నంద్యాల (నూనెపల్లె), జూన్ 26: నూతనంగా బాధ్యతలు స్వీకరించిన లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి బుధవారం రాత్రి స్పీకర్ నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. దేశ అత్యున్నత లోక్‌సభ స్పీకర్ పదవికి వరుసగా రెండోసారి ఏకగ్రీవంగా ఓం బిర్లా ఎంపిక కావడం గర్వ కారణమని ఆమె అన్నారు. 18వ లోక్‌సభ పార్లమెంట్ సభ్యులందరి సహకారంతో పార్లమెంట్ సమావేశాలు సాఫీగా జరగాలని కోరారు.

తపాలా జీవిత బీమాపై అవగాహన ర్యాలీ



మద్దూరులో ర్యాలీ చేస్తున్న తపాలాశాఖ అధికారులు

చాగలమర్రి, జూన్ 26: మండలంలోని మద్దూరు గ్రామంలో తపాలా జీవిత బీమాపై బుధవారం నంద్యాల పోస్టల్ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. తపాలా శాఖలో లభించే పథకాల గురించి ప్రజలకు వివరించారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ 19 నుంచి 55 సంవత్సరాల వారి కోసం గ్రామీణ తపాలా జీవిత బీమా, గ్రాడ్యుయేట్స్, ఉద్యోగులకు జీవిత బీమా ఇన్సూరెన్స్ ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. ఆర్డీ ఖాతా, 10 సంవత్సరాల బాలికల కోసం సుకన్య సంవృద్ధి ఖాతా, మహిళల కోసం మహిళా సేవింగ్, సమ్మాన్ సర్టిఫికెట్, పీపీఎఫ్ ఖాతాలను ఉపయోగించుకోవాలని అన్నారు. 19 సంవత్సరాల నుంచి 65 సంవత్సరాల వ్యక్తుల కోసం ఒక సంవత్సరం కాలానికి రూ.5 లక్షలకు రూ.329, రూ.10 లక్షలకు రూ.549, 15 లక్షలకు రూ.750 ప్రమాద బీమా లభిస్తుందని అన్నారు. కార్యక్రమంలో ఆళ్లగడ్డ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ రామ్‌నాథ్, చాగలమర్రి పోస్టుమాస్టార్ మనోజ్‌కుమార్, సాదిక్, భాస్కర్‌రావు, పెద్దరాజు, పోస్టల్ ఉద్యోగులు పాల్గొన్నారు.

పాత పద్ధతిలో రేషన్ పంపిణీపై హర్షం

డోన్(రూరల్), జూన్ 26: తెలుగుదేశం కూటమి ప్రభుత్వం రేషన్ పంపిణీ కార్యక్రమాన్ని పాత పద్ధతిలోనే అమలు చేయనుండటంపై డోన్ జనసేన నియోజకవర్గ నాయకుడు అలా మోహన్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. బుధవారం డోన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం ఇళ్ల వద్దకే రేషన్ పంపిణీ కార్యక్రమం ద్వారా పేదలకు పలు ఇబ్బందులకు గురి చేసిందన్నారు. ఇంటి వద్దకు రేషన్ వాహనాలు వచ్చి ఇళ్ల వద్దనే బియ్యం పంపిణీ చేస్తుందని వైసీపీ ప్రభుత్వం ప్రజలకు మభ్యపెట్టిందన్నారు. రేషన్ వాహనాలు ఏ సమయంలో వస్తాయో తెలియక పేదలు పనులకు వెళ్లలేక దినసరి కూలీలు నష్టపోయిన సందర్భాలు ఉన్నాయన్నారు. ప్రస్తుత టీడీపీ కూటమి ప్రభుత్వం రేషన్ వాహనాలను రద్దు చేసి స్టోర్ డీలర్ల వద్దనే రేషన్ పంపిణీకి శ్రీకారం చుట్టడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో అవులదొడ్డికి చెందిన టీడీపీ అభిమానులు చిన్న పుల్లన్న, సురేష్, బాలరాజు పాల్గొన్నారు.

ఏఆర్‌టీ మందుల పంపిణీ

డోన్(రూరల్), జూన్ 26: డోన్ ప్రభుత్వ ఆసుపత్రిలో బుధవారం హెచ్‌ఐవీ బాధితులకు ఏఆర్‌టీ మందుల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఏపీ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారి అలి హైదర్ ఆదేశాల మేరకు హ్యాండ్స్ సంస్థ సహకారంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో డాక్టర్లు, ఏఆర్‌టీ సిబ్బంది రాజ్‌కుమార్, సుధారాణి, ఐసీటీసీ కౌన్సిలర్ శేషన్న, సీతా మహాలక్ష్మి, లలిత, హ్యాండ్స్ సంస్థ సభ్యులు మధుకుమార్, సరస్వతి, షాజహాన్, మౌనిక, సోఫియా, రాజేశ్వరి పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్త మృతికి సంతాపం

డోన్, జూన్ 26: పట్టణంలోని కొండపేటలో టీడీపీ నాయకుడు కిషన్ సింగ్ సోదరుడు నాగేంద్రసింగ్ (45) బుధవారం మృతి చెందాడు. టీడీపీ కార్యకర్త మృతికి డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోట్రికే ఫణిరాజ్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ టీఈ కేశన్నగౌడు, లక్ష్మీనారాయణ యాదవ్ సంతాపం తెలిపారు. కిషన్‌సింగ్ కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే కోట్ల పరామర్శించారు.

ఆలయాభివృద్ధికి విరాళం

బనగానపల్లె, జూన్ 26: వీరభద్రస్వామి ఆలయాభివృద్ధికి పలువురు భక్తులు బుధవారం పలుకూరులో పూజారి భాస్కరయ్యకు రూ.30వేలు విరాళం అందించారు. వీరభద్రస్వామి ధూప, దీప, నైవేద్యానికి దాతలు జిల్లెళ్ల నాగేశ్వరరెడ్డి రూ.5వేలు, ఎం.మధు మోహన్‌రెడ్డి రూ.5వేలు, బ్రహ్మయ్యాచారి రూ.5వేలు, గాలిమిషన్ తెలుగు లక్ష్మీదేవి రూ.20వేలు విరాళం అందించారు.

అతిసారపై అప్రమత్తంగా ఉండాలి

చాగలమర్రి, జూన్ 26: గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు అతిసారపై అప్రమత్తంగా ఉండాలని ఆరోగ్య విస్తరణాధికారి వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం మండలంలోని డి.వనిపెంట, చెంచుగూడెం గ్రామాల్లో అతిసార వ్యాధి నివారణ పక్షోత్సవ ర్యాలీ నిర్వహించారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని అన్నారు. బీసీజీ టీకా తప్పనిసరిగా వేయించుకోవాలని సూచించారు. మలేరియా, డెంగ్యూ, చికెన్‌గున్యా, డయేరియా వ్యాధుల పట్ల నిర్లక్ష్యం చేయరాదని అన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి సుబ్బరాయుడు, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

క్రీడా మైదానం పరిశీలన

చాగలమర్రి, జూన్ 26: చాగలమర్రి బాలికోన్నత పాఠశాలలో బాలికల క్రీడాభివృద్ధి కోసం ఏర్పాటు చేసిన క్రీడా మైదానాన్ని జిల్లా డీఈ నాగభూషణం, ఏఈలు బుధవారం పరిశీలించారు. ప్రధానమంత్రి పాఠశాలల అభివృద్ధి పథకం కింద బాలికోన్నత పాఠశాల ఎంపికైందని అన్నారు. ఈ పథకం కింద రూ.5 లక్షలు నిధులను కేటాయించారు. ఈ నిధులలో రూ.లక్ష వెచ్చించి క్రీడా మైదానం పనులను చేపట్టారు. వర్షపు నీరు పాఠశాలలోకి ప్రవేశించకుండా డీఈ, ఏఈలు పరిశీలించారు.

కారు -మోటరు బైకు ఢీ.. వ్యక్తికి గాయాలు

కోవెలకుంట్ల, జూన్ 26: కారు - మోటరు బైకు ఢీకొనడంతో ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. ఈ సంఘటన జోళదరాశి - కలుగొట్ల గ్రామాల మధ్యన ఉన్న ఆర్‌అండ్‌బీ రహదారిలో బుధవారం సాయంత్రం జరిగింది. శిరివెళ్ల పట్టణానికి చెందిన బాలస్వామి అనే వ్యక్తి ప్రతిరోజూ కోవెలకుంట్ల మండలం వెలగటూరు గ్రామానికి వచ్చి పెయింటింగ్ పనిచేసి తిరిగి స్వగ్రామానికి వెళుతుండేవాడు. బుధవారం సాయంత్రం శిరివెళ్లకు వెళుతుండగా జోళదరాశి - కలుగొట్ల గ్రామాల మధ్యకు వచ్చేసరికి నంద్యాల నుండి కోవెలకుంట్లకు వస్తున్న కారు వచ్చి బాలస్వామి ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బాలస్వామికి ఒక కాలు విరిగింది. చేతికి గాయాలయ్యాయి. బాధితుడ్ని కోవెలకుంట్ల ప్రభుత్వాసుపత్రిలో ప్రథమ చికిత్స చేయించారు. మెరుగైన చికిత్స కోసం నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

మంత్రి ఆదేశాల మేరకు పారిశుధ్య పనులు

బనగానపల్లె, జూన్ 26: గత వైసీపీ ప్రభుత్వ హయాంలో మురుగు కాల్వలు అధ్వానంగా ఉండేవి. మూడు నెలలకు ఓసారి మురుగు కాల్వలను పరిశుభ్రం చేసే వారు. బనగానపల్లె పట్టణంలో రోడ్లు, భవనాల శాఖామంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ఆదేశాల మేరకు పారిశుధ్య పనులు చేపట్టినట్లు బనగానపల్లె ఈవో హరిప్రసాద్ బుధవారం తెలిపారు. సీజనల్ వ్యాధులు ప్రారంభం కావడంతో వీధులను పరిశుభ్రం చేసి, మురుగు కాల్వలను పరిశుభ్రం చేస్తున్నట్లు తెలిపారు.

VEHICLE FOR SALE

VEHICLE NO.	DESCRIPTION	MODEL
AP39GA-8079	XCENT 5 SEATER	2015

M/S SHRIRAM AUTOMALL INDIA LIMITED
GOSULA KRISHNA REDDY CIRCLE, OPP: DEVUNI KADAPA ARCH, RAJAMPETA BYPASS ROAD, PATHA KADAPA, KADAPA, CONTACT NUMBERS : 83416 77479, 97047 00203

VEHICLE FOR SALE

VEHICLE NO.	DESCRIPTION	MODEL
AP40E4384	SONALIKA DI 740	2023

M/S SHRIRAM AUTOMALL INDIA LIMITED
NH-44, NEAR ALLAMPUR TOLLGATE, PANCHALINGALA (V) KURNOOL (DT.)
CELL: 97047 00203, 83416 77479.

అభివృద్ధిలో ముందడుగు వేద్దాం

» పారిశుధ్యం మెరుగునకు చర్యలు తీసుకోవాలి
» మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో ఎమ్మెల్యే కోట్ల


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి

డోన్, జూన్ 26: ప్రజల ఆకాంక్షలు ప్రతిబింబించేలా అభివృద్ధిలో ముందడుగు వేద్దామని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ సమావేశ భవనంలో జరిగిన కౌన్సిల్ సమావేశానికి ఎమ్మెల్యే కోట్ల ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మొదటిసారి సమావేశంలో పాల్గొనేందుకు వచ్చిన ఎమ్మెల్యే కోట్లను మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్, వైస్ చైర్మన్ కోట్రికే హరికిషన్, కమిషనర్ డా.జయరాములు కలిసి పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. అనంతరం చైర్మన్ రాజేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ కొత్త ప్రణాళికలతో డోన్‌ను అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నానన్నారు. పట్టణంలో ఇటీవల వార్డుల్లో పర్యటించానని, పారిశుధ్యం, డ్రైనేజీ, తాగునీటి సమస్య, రహదారులు, విద్యుత్ వంటి సమస్యలను ప్రజలు తమ దృష్టికి తీసుకువచ్చారన్నారు. తాగునీటి సమస్య తలెత్తకుండా చూద్దామన్నారు. పట్టణంలో పారిశుధ్య మెరుగునకు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులు, కౌన్సిలర్లు సహ కారాలు అందించాలన్నారు. పట్టణంలో ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం నుంచి అవసరమైన నిధులు మంజూరు చేయిం చేందుకు కృషి చేస్తానన్నారు.

● **ట్రాఫిక్ సమస్య నియంత్రించాలి:** పట్టణంలో ట్రాఫిక్ సమస్య నియంత్రించేలా చర్యలు తీసుకోవాలని ఆర్‌అండ్‌బీ ఈఈ శ్రీధర్ రెడ్డిని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి ఆదేశించారు. బుధవారం పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో రైల్వే, ఆర్‌అండ్‌బీ అధికారులతో ఎమ్మెల్యే కోట్ల సమీక్ష నిర్వహించారు. పట్టణంలోని పాతపేటలోకి భారీ వాహనాలు వచ్చేలా రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఎమ్మెల్యే ఆదేశించారు. పాతపేట శ్రీరాములయం సమీపంలోని రైల్వే గేట్ల వద్ద బ్రిడ్జి నిర్మాణానికి అవసరమైన ప్రతిపాదనలు తయారు చేయాల న్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కేశవయ్యగౌడు, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ లక్ష్మీరెడ్డి, మర్రి రమణ, కమలాపురం సర్పంచ్ రేగటి అర్జున్ రెడ్డి, బేతంచెర్ల మండల పార్టీ అధ్యక్షుడు ఎల్లనాగయ్య, చిట్యాల మద్దయ్యగౌడు, అన్వర్‌బాషా, సీనియర్ న్యాయవాదులు శ్రీనివాసభట్టు, ఎస్‌టీ హరున్, హనుమంతరెడ్డి, ఓంప్రకాష్, జనసేన నాయకుడు అలా మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలి: డోన్ నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి జిల్లా నైపుణ్య అభివృద్ధి సంస్థ అధికారులను ఆదేశించారు. బుధవారం పట్టణంలోని కోట్ల నివాసంలో జిల్లా నైపుణ్య అభివృద్ధి సంస్థ మేనేజర్ ప్రతాప్ రెడ్డి, జిల్లా కోఆర్డినేటర్ చైతన్య, ప్రతినిధులు భూపాల్ రెడ్డి, వెంకటేశ్వర్లుతో ఎమ్మెల్యే సమీక్ష నిర్వహించారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించండి



మాట్లాడుతున్న నరసింహారెడ్డి

బేతంచెర్ల, జూన్ 26: విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని నవ్యాంధ్ర స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నర్సింహారెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని రీడ్ జూనియర్ కళాశాలలో మండల అధ్యక్షుడు బండారు వెంకటేశ్వర్లు అధ్యక్షతన విలేక రుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బోరెడ్డి నరసింహారెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వాలు నూతన విద్యావిధానాన్ని భ్రష్టు పట్టించాయన్నారు. టీడీపీ ప్రభుత్వం తల్లికి వందనం ప్రతి విద్యార్థికి అందేవిధంగా చూడాలన్నారు. సంక్షేమ హాస్టళ్ల సంబంధించి పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని కోరారు. నవ్యాంధ్ర స్టూడెంట్ ఫెడరేషన్ ఉమ్మడి కర్నూలు జిల్లాల అధ్యక్షుడు నాగ సురేంద్ర మాట్లాడారు. అనంతరం మండల అధ్యక్షుడిగా వెంకటేశ్, కార్యదర్శిగా రాజేష్, సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నాయకులు ఓబుల్ రెడ్డి, వినోద్, సురేష్, పవన్, రవి, జోగేంద్ర పాల్గొన్నారు.

అక్రమ అడ్మిషన్లపై నిరసన

డోన్(రూరల్), జూన్ 26: పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో అక్రమ అడ్మిషన్లపై ఏఐఎస్ఎఫ్ నాయకులు బుధవారం నిరసన వ్యక్తం చేశారు. పాఠశాల భవనాలు, నిర్మాణాలు పూర్తి కాకుండానే అడ్మిషన్లు నిర్వహించడంపై ఏఐఎస్ఎఫ్ నాయకులు పాఠశాల ఎదుట ఆందోళనకు దిగారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు మనోజ్ యాదవ్, శశిధర్ రెడ్డి, రంగస్వామి, అశ్వద్ పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండండి

డోన్(రూరల్), జూన్ 26: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని డోన్ రూరల్ సీఐ అజ్రత్ బాషా, పట్టణ ఎస్ఐ శరత్ కుమార్ రెడ్డి సూచించారు. బుధవారం సాయంత్రం పట్టణంలోని పాతబస్టాండులో మత్తు, మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గంజాయి, డ్రగ్స్ తదితర మత్తు పదార్థాలు సేవించినా, అమ్మినా కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో రూరల్, పట్టణ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కోవెలకుంట్ల: సమాజానికి యువత ఆదర్శంగా ఉండాలని కోవెలకుంట్ల సీఐ జయచంద్ర అన్నారు. బుధవారం కోవెలకుంట్ల పట్టణంలో అంతర్జాతీయ మాదక ద్రవ్య వ్యతిరేక దినోత్సవం సందర్భంగా సీఐ ఆధ్వర్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహిం చారు. మాదక ద్రవ్యాలు వాడడం వల్ల కలిగే నష్టాల గురించి సీఐ వివరించారు. కార్యక్రమంలో ఎస్ఐ వర ప్రసాద్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని వాసవి బొమిడాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాదక ద్రవ్య వ్యతిరేక దినోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎన్‌ఫోర్స్‌మెంటు బ్యూరో సర్కిల్ ఇన్స్‌పెక్టరు వర్దనాదేవి హాజరై మాట్లా డారు. కార్యక్రమంలో అధ్యాపకులు హెచ్.రామసుబ్బారెడ్డి, భాస్కర్‌రెడ్డి, రాజశేఖర్, క్రిష్ణదాస్, నాగేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.





డోన్‌లో అవగాహన కల్పిస్తున్న రూరల్ సీఐ అజ్రత్ బాషా, బనగానపల్లెలో..

బనగానపల్లె: యువత సమాజానికి ఆదర్శంగా నిలవాలని బనగానపల్లె సీఐ గంటా సుబ్బారావు అన్నారు. బుధవారం బనగానపల్లె పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. మాదకద్రవ్యాలతో యువత ఏలా నాశనమవుతున్నారో సీఐ వివరించారు. ఈ ర్యాలీలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చాగలమర్రి: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉంటేనే జీవితంలో ఉన్నతమైన స్థానం దక్కించుకుంటారని ఆళ్లగడ్డ రూరల్ సీఐ హనుమంతనాయక్ అన్నారు. బుధవారం చాగలమర్రి జిల్లాపరిషత్ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి అంతర్జాతీయ మత్తుపదార్థాల వ్యతిరేక దినోత్సవ ర్యాలీ నిర్వహించారు. గాంధీ సెంటర్‌లో మానవహారంగా ఏర్పడి విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. యువత మత్తుపదార్థాలకు బానిసై జీవితం నాశనం చేసుకోరాదన్నారు. ఎస్ఐ రమణయ్య, హెచ్ఎం కోటయ్య, ఉపాధ్యాయులు శివశంకర్, రవింద్రారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, శాస్త్రి, సురేషప్ప, పీఈటీ భారతి, ప్రసన్న, పోలీసులు, విద్యార్థులు పాల్గొన్నారు




చాగలమర్రిలో ర్యాలీ నిర్వహిస్తున్న ఆళ్లగడ్డ సీఐ, ఎస్ఐ, విద్యార్థులు, కోవెలకుంట్లలో మాట్లాడుతున్న సీఐ జయచంద్ర

రక్షణ గోడ నిర్మాణ పనుల్లో నాణ్యత లోపం

ఆలయం వద్ద కూలిన రక్షణ గోడ


నరసింహ స్వామి ఆలయం వద్ద కూలిన రక్షణ గోడ

శిరివెళ్ల, జూన్ 26: నంద్యాల-గిద్దలూరు ప్రధాన రహదారిలో నల్లమల అటవీ ప్రాంతంలో కొలువైన సర్వలక్ష్మీ నరసింహస్వామి ఆలయం వద్ద నిర్మించిన రక్షణ గోడ(సైడ్ వాల్) కూలిపోయింది. ఆలయ అభివృద్ధి పనుల్లో భాగంగా చేపట్టిన నిర్మాణ పనుల్లో నాణ్యత లోపించడంతోనే రాతి కట్టడం కూలిపోయింది. రాతి కట్టడం మధ్యలో గులకరాళ్లను వేసి నిర్మించడం, ఇసుక, సిమెంటు వినియోగం, సరైన నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడంతోనే కూలినట్లు తెలుస్తోంది. భక్తులు ఎవ్వరూ లేని సమయంలో రక్షణ గోడ కూలడంతో పెను ప్రమాదం తప్పింది. 2018లో కురిసిన వర్షాల ధాటికి ఆలయ ముందుభాగంలోని పురాతన రాతి కట్టడం, ప్రహరీ, ధ్వజస్తంభం కూలిపోయాయి. దీంతో అప్పటి నుంచి ఆలయం పూర్వ వైభవాన్ని కోల్పోతూ వచ్చింది. ఆలయ అభివృద్ధిలో భాగంగా రూ.20 లక్షల దేవాదాయశాఖ నిధులతో 2020వ సంవత్సరం వరకు ఫౌండేషన్ పనులు చేపట్టారు. ఆలయం కింద నుంచి పై భాగం వరకు దాదాపు 50 అడుగుల మేర నిర్మాణ పనులు చేపట్టాలంటే కోట్ల రూపాయలు ఖర్చు కానుండడంతో పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. అనంతరం రూ.1.6 కోట్ల టీటీడీ నిధులతో రక్షణ గోడ నిర్మాణ పనులు చేపట్టేందుకు ఆళ్లగడ్డ మాజీ ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీ 2022, జూన్ 4న భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. నిధుల మంజూరులో ఏర్పడుతున్న జాప్యం వల్ల రెండేళ్లవుతున్నా రక్షణ గోడ నిర్మాణ పనులు మందకోడిగా సాగుతున్నాయి. ఈ విషయంపై ఆలయ ఈవో బీవీ నరసయ్యను వివరణ కోరగా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని, రక్షణ గోడ పునః నిర్మించేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

26 రోజులుగా సంతకాలు చేయలేదు

సచివాలయ ఉద్యోగులకు మెమో జారీ



సచివాలయ ఉద్యోగులను వివరాలు అడుగుతున్న ఈవోపీఆర్‌డీ

రుద్రవరం, జూన్ 26: మండలంలోని మందలూరు సచివాలయంలో నలుగురు ఉద్యోగులు ఏకంగా హాజరుపట్టిలో 26 రోజులు సంతకాలు చేయలేదని ఈవోపీఆర్‌డీ శ్రీనివాసశర్మ అన్నారు. బుధవారం ఈవోపీఆర్‌డీ మందలూరు సచివాలయం తనిఖీ చేయడంతో తేటతెల్లమైంది. ఒక్కరోజు కాదు..రెండురోజులు కాదు.. ఏకంగా 26 రోజులు హాజరుపట్టికలో సంతకాలు చేయలేదన్నారు. వీరిలో ఎస్‌కే షబీయా - వెల్ఫేర్ అసిస్టెంటు, టి.లావణ్య - సర్వేయరు, కె.ఫకృద్దీన్ - వీఆర్వో, ఎన్. సంజమ్మ - ఇంజనీరింగ్ అసిస్టెంటు ఉన్నారు. వీరికి మెమో జారీ చేసినట్లు తెలిపారు. ఈ విషయాన్ని ఉన్నతధికారుల దృష్టికి తీసుకువెళ్లినట్లు ఆయన తెలిపారు.

టీడీపీ కార్యకర్త హత్య కేసులో 15 మందిపై కేసు నమోదు

ఆళ్లగడ్డ, జూన్ 26: ఆళ్లగడ్డ పట్టణానికి చెందిన టీడీపీ కార్యకర్త అట్ల శ్రీదేవి(55) మంగళవారం రాత్రి దారుణ హత్యకు గురైన విషయం తెలిసిందే. ఈ హత్య కేసులో 15 మందిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ రమేష్‌బాబు బుధవారం రాత్రి చెప్పారు. ఈకేసులో ఏవీ సుబ్బారెడ్డి కుటుంబ సభ్యులైన భార్య, ముగ్గురు కూతుళ్లపై కేసు నమోదు చేశామన్నారు. ప్రధానంగా హత్య కేసులో పాల్గొన్న వారి కోసం తీవ్రంగా గాలిస్తున్నట్లు ఆయన చెప్పారు. భర్త భాస్కరరెడ్డి వైద్యశాలలో కోలుకుంటున్నట్లు సీఐ చెప్పారు. మంగళవారం రాత్రి ఎస్పీ రఘువీర్‌రెడ్డి హత్యా సంఘటన స్థలాన్ని పరిశీలించి నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

బీజేపీ డోన్ నియోజకవర్గ కోఆర్డినేటర్‌గా వడ్డె మహారాజ్



డోన్, జూన్ 26: బీజేపీ డోన్ నియోజకవర్గ కోఆర్డినేటర్‌గా వడ్డె మహారాజ్ బుధవారం నియమితులయ్యారు. బుధవారం పట్టణంలోని రోట రీ భవన్‌లో జరిగిన బీజేపీ విస్తృత స్థాయి సమావేశానికి జిల్లా కోఆర్డినేటర్ అభిరుచి మధు ఆధ్వర్యంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. డోన్ నియోజకవర్గ కోఆర్డినేటర్‌గా వడ్డె మహారాజ్‌ను ప్రకటించారు. ఈ సందర్భంగా అభిరుచి మధు మాట్లాడుతూ బీజేపీలో కష్టపడిన నాయకులకు, కార్యక ర్తలకు తప్పనిసరిగా మంచి గుర్తింపు ఉంటుందన్నారు. కార్యక్రమంలో లింగన్న, సందు వెంకటరమణ, ఆర్మీ రామ య్య, హేమ సుందర్ రెడ్డి, మద్దిలేటి పాల్గొన్నారు.

వడ్డె మహారాజ్ ఎంపికపై హర్షం

ప్యాపిలి, జూన్ 26: బీజేపీ డోన్ నియోజకవర్గం కో ఆర్డినేటర్‌గా వడ్డె మహారాజ్ ఎంపిక పట్ల ఆ పార్టీ మండల నాయకులు దామోదర నాయు డు, కేసీ మద్దిలేటి హర్షం వ్యక్తం చేశారు. మండల స్థాయి నుంచి జిల్లా స్థాయికి ఎదిగిన మహారాజ్‌ను డోన్ కోఆర్డినేటర్‌గా నియమించడంపై అధిష్టానానికి వారు ధన్యవాదాలు తెలిపారు.

ఇంటర్ ఫలితాల్లో విద్యార్థిని ప్రతిభ


విద్యార్థిని లక్ష్మి అమృత

డోన్(రూరల్), జూన్ 26: డోన్ పట్టణంలోని శ్రీసుధ ఇంటర్ కళాశాలకు చెందిన లక్ష్మి అమృత అనే విద్యార్థిని ఇంటర్ మొదటి సంవత్సరం ఇంప్రూవ్ మెంట్ పరీక్షల ఫలితాల్లో ప్రతిభ కనబర్చింది. లక్ష్మి అమృత 466/470 మార్కులు సాధించినట్లు తల్లిదండ్రులు పరదేశీ మహేష్, శ్రీలత తెలిపారు. విద్యార్థినికి తల్లిదండ్రులు అభినందించి స్వీట్లు తినిపించారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

సంజామల, జూన్ 26: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయుష్ వైద్యాధికారి గోకారి అన్నారు. పెద్దలు, పిల్లలు అతిసార బారిన పడకుండ తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. అతిసార నివారణపై గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. హెల్త్ ఎడ్యుకేటర్ నారాయణ దాస్, ఎంపీహెచ్ఈవో వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

దొర్నిపాడు: మండలంలోని ఆయా గ్రామాల ప్రజలు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి నాగేంద్ర అన్నారు. వైద్యులు మాట్లాడుతూ వర్షాకాలం కాబట్టి వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని అన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవా లని సూచించారు. తాగునీటిని వేడి చేసి చల్లార్చి తాగాలని అన్నారు.

ఆలయ భూములకు వేలం పాట

కొలిమిగుండ్ల రూరల్, జూన్ 26: మండలంలోని తిమ్మనాయినిపేట గ్రామంలో ఆలయ భూములకు బుధవారం వేలం నిర్వహించారు. గ్రామంలోని వెర్రి గోవిందరాజుల స్వామి ఆలయం, అగస్తీశ్వరస్వామి ఆలయం, వేణుగోపాలస్వామి ఆలయం, చెన్నకేశవస్వామి ఆలయాలకు సంబంధించిన 30ఎకరాలకు కౌలు వేలం పాటలు నిర్వహించగా రూ.2.17 ఆదాయం లభించినట్లు ఆలయ ఈఓ చంద్రుడు వెల్లడించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ఉయ్యాలవాడ, జూన్ 26: అల్లూరు గ్రామ సమీపంలోని కుందరవాగు బ్రిడ్జి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో బనగానపల్లె పట్టణానికి చెందిన సుబ్బరాయుడుకు తీవ్ర గాయాలయ్యాయి. మంగళవారం ఉదయం సుబ్బరాయుడు వ్యాపార నిమిత్తం తన స్టీల్ సామాను ఆటోతో అల్లూరు గ్రామానికి బయలుదేరాడు. కుందరవాగు బ్రిడ్జి వద్దకు రాగానే మూత్రం పోసేందుకు ఆటో దిగుతుండగా వెనకవైపు నుంచి వేగంగా వచ్చి మరో ఆటో ఢీ కొట్టింది. దీంతో సుబ్బరాయుడుకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గుర్తించి 108కు ఫోన్‌చేసి అంబులెన్స్ ద్వారా కోవెలకుంట్ల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స చేయించి మెరుగైన వైద్యం కోసం అక్కడి నుంచి నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. దీనిపై పోలీసులను వివరణ కోరగా విచారణ జరుపుతున్నామన్నారు.

రహదారికి మరమ్మతులు

రుద్రవరం, జూన్ 26: మండలంలోని టి.లింగందిన్నె గ్రామంలో ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రహదారులకు మరమ్మతులు చేయిస్తున్నట్లు బుధవారం సర్పంచ్ లక్ష్మీదేవి తెలిపారు. ఆళ్లగడ్డ ఎమ్మెల్యే అఖిలప్రియ ఆదేశాల మేరకు రహదారులకు మరమ్మతులు చేయిస్తున్నామన్నారు.

బేతంచెర్ల స్టేషన్‌లో అన్ని రైళ్లను ఆపాలి

బేతంచెర్ల, జూన్ 26: బేతంచెర్ల రైల్వేస్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్లతోపాటు అన్ని రైళ్లు నిలపాలని టీడీపీ మండల కన్వీనర్ ఎల్ల నాగయ్య డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డికి బుధవారం వినతి పత్రం అందజేశారు. గతంలో బేతంచెర్ల రైల్వే స్టేషన్‌లో అన్ని రైళ్లు ఆగేవని, ప్రస్తుతం ఆపడం లేదని కోట్లకు వివరించారు.

ప్రజలకు రక్షిత మంచినీరు అందిద్దాం

రుద్రవరం, జూన్ 26: ప్రజలకు రక్షిత మంచినీరు అందిద్దామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రమోద్ అన్నారు. బుధవారం మండలంలోని కోటకొండ, కొత్తూరు, చెంచుగూడెం, యల్లావత్తుల, బోరవోలు, శ్రీరంగాపురం, డి.కొట్టాల గ్రామాల్లో తాగునీటిని పరీక్షించినట్లు తెలిపారు.

ప్రాంగణ నియామకాలను సద్వినియోగం చేసుకోండి

డోన్(రూరల్), జూన్ 26: ఈనెల 28వ తేదీ నిర్వహించే ప్రాంగణ నియామకాలను సద్వినియోగం చేసుకోవాలని డోన్ ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ ప్రసాద్ రెడ్డి కోరారు. హైదరాబాదు, బెంగళూరు, చెన్నై, వివిధ జిల్లాలకు చెందిన కంపెనీల ప్రతినిధులు ఈ కార్యక్రమాల్లో పాల్గొని ఉద్యోగావకాశాలు కల్పిస్తారన్నారు.

విద్యతోనే విజ్ఞానం

ప్యాపిలి, జూన్ 26: విద్యతోనే విజ్ఞానం లభిస్తుందని మండల విద్యాధికారి వెంకటేశ్వరనాయక్ అన్నారు. బుధవారం మండలంలోని వెంగళాంపల్లిలో నేను బడికి పోతాలో భాగంగా విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన పాఠశాలను తనిఖీ చేశారు.

విద్యార్థుల సంఖ్య పెంచాలి

చాగలమర్రి, జూన్ 26: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచాలని ఎంఈవోలు అనూరాధ, న్యామతుల్ల అన్నారు. బుధవారం చాగలమర్రి ఎమ్మార్సీ కార్యాలయంలో హెచ్‌ఎంలచే జూమ్‌యాప్ ద్వార సమావేశం నిర్వహించారు. సీఆర్పీలు పాల్గొన్నారు.

శ్రీకృష్ణాలయంలో గీతా హోమం

బనగానపల్లె, జూన్ 26: మండలంలోని యనకండ్ల గ్రామంలోని శ్రీకృష్ణాలయంలో గీతా హోమం బుధవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆధ్యాత్మిక గురువు గురూజీ రామశేషయ్య, దొంతా వెంకటేశ్వర్లు, సుబ్బ లక్ష్మమ్మలు పాల్గొన్నారు.